# మిసిమి

మాస పత్రిక

ఆగస్టు 2000



వెల-రూ. 8/-



శ్రీ బి.కె.ఎస్. వర్మ



జీవన చక్రం

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**


సంపుటి 12 ఆగస్టు 2000 సంచిక 8

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


చిత్రకళావధాని - బి. కె. శ్రీనివాస వర్మ - డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

యక్ష ప్రశ్నలు మరో పది - సి. ధర్మారావు

స్వీడన్ - ఒక స్వచ్ఛ స్మృతి - డా॥ యు. ఎ. నరసింహమూర్తి

ఆధునికానంతర మనో వైజ్ఞానిక శాస్త్రవేత్త జాక్ లకా - బి. తిరుపతిరావు

ప్రాచీన భారతం - భూస్వామ్య వ్యవస్థ - శివలింగం

గియోర్గి లుకాచ్ - సౌందర్య శాస్త్రం - డా॥ తక్కోలు మాచిరెడ్డి

నూతిలో గొంతుకల 20వ శతాబ్దపు తెలుగు కవిత్వం ! - నరేష్ నున్నా

నవ్యాంధ్ర నిర్మాణ నిర్మాతల జంట - డా॥ విజయబక్ష్



**విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20**

ముఖచిత్రం : **మేఘ - మిలన్**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd., 1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536
E-mail : misimi_m@hotmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# HABIT OF ASKING QUESTIONS

**- DEEP INDER**

"What are you doing?" Whether you're reading a newspaper or making love to your boyfriend this question is bound to pop up. It is perhaps the most common question in India today. I am sure it must not be very uncommon in other parts of the world either but the extent to which it is used in India cannot be matched anywhere else. Besides, this is not the only asinine query which is an Indian's delight.

If there were any competition for asking obviously stupid questions I'm sure Indians would take the gold medal; perhaps, even a "diamond medal" would have to be initiated! The range of stupid questions we are capable of asking is unquestionably the widest. The beautiful diversity, the great depth, the unusual insight of stupidity so explicitly and artfully expressed by an Indian through his innocent questions is unmatched. The unparalleled stiff upper lip of the Englishman is foolishly funny to an outsider, the American with his undue openness and over-curious nature is laughable and every other nation has its own typical brand of stupidity for which its people are ensured a gold medal in their particular speciality. However, the vast vista this particular field of asking stupidly empty questions opens, shows the ingenuity of the Indian mind. If the others are entitled to gold medals for their particular brands of stupidity, a "diamond medal" should surely grace the Indian.

This is not an idle statement. My experience proves it. I have rolled my hump these past 40 years and have had many personal experiences of all kinds of stupidity from the Irish to the American and from the Nigerian to the Australian but, believe me, there is no national brand of stupidity which can compete with this Indian brand. Others have, no doubt, tried to imitate our brand but then an original is an original and a fake futile. A forged Rembrandt may fool most of the people some of the time, fake Levis may fool some of the people some of the time or even for all time but a foreigner who says, "Are you washing dishes"? or even "What are you doing?" to a person washing dishes looks as ridiculous as a cobbler in royal robes, as out of place as a longshoreman in Queen Victoria's bedroom – but, not so an Indian.

## ANSWERS

The finesse and innocent grace which an Indian has developed over the years is simply marvellous. Incomparable. He can get away with anything. With perfect elan, he can ask this question of a Casanova kissing his favourite female or of a barber giving him. (the questioner) a shave. He will be taken seriously – and answered! Atleast 99 times out of 100, he will be answere. He may ask, most seriously, a person watching television, "Are you watching television?" He will be answered. He can ask Madonna in the midst of her favourite song, "Are you singing?" and is very likely to get away with it !

I am one of the very few who does not bite the bait and usually resist replying to the "what're you doing?" and other questions when the answer is obvious. Still, hardly anyone desists from asking me such questions. Only last week, seeing me playing with my dog, Dollar in the garden my innocent neighbour asked with the utmost seriousness the inevitable question: "What are you doing?" Hiding the daggers in my heart, I ignored the question and the questioner. But, he persisted, "Hello!" His voice was considerable louder, "What're you doing?" I gave him the pleasantest smile I possess and replied, "Plucking orchids." Obviously confused, the poor fellow could just stammer. "But, but I thought you were playing with Dollar." I kept on smiling. He laughed. I laughed. We both laughed. Just then my daughter came out. "What're you two doing?" Her question made his forced laughter genuine and my sarcastic laugh turned pitifully painful but we carried on and she simply went back to her room, probably sure the neighbour's place was also now ensured in the loony - bin.

*Continued on Page No. 233*

# చిత్రకళావధాని – బి. కె. శ్రీనివాస వర్మ

– డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

కళా రంగంలో అద్భుత చమత్కారం. ప్రజల మధ్య నిల్చి, క్షణంలో కోరిన వివిధ చిత్రాలను ఏక కాలంలో ఎనిమిది క్యాన్‌వాస్‌లపై నిలువెత్తు చిత్రాలను గీచే 'చిత్రావధాన' కళా సామ్రాట్ ఆయన. కావ్యానికి చిత్రం, చిత్రానికి కావ్యం, సభికుల ప్రశ్నలకు సమాధానంగా చిత్ర పరంపర. మెరుపు వేగంతో కుంచె, దారం, గుడ్డ, బ్లేడు, రేకులతో 24 గంటలు ఏకధాటిగ చిత్రాలను సృష్టించే అన్యాదృశ కళాకారుడు ఆయన. 20-30 అడుగుల పొడుగాటి కర్రకు కుంచెను కూర్చి 100- 200 అడుగుల బృహత్ చిత్రాన్ని రచించే మేరు సదృశ చిత్ర బ్రహ్మ ఆయన. ఆ కళా తపస్వి, బి.కె. శ్రీనివాస వర్మ. వచ్చే సెప్టెంబర్‌తో యాభై వసంతాలు పూర్తి చేసుకోనున్న అభినవ రవివర్మ. ఐదు అడుగుల ఎత్తైన, బి.కె. శ్రీనివాస్, రవివర్మ కళా శిఖరాన్ని అందుకోవాలన్న ఆశతో తన 12వ ఏట, తన అసలు పేరు శ్రీనివాస్‌కు 'వర్మ'ను అతికించు కొన్నారు. సర్రియలిస్ట్, రియలిస్టిక్ మరియు డెకొరేటివ్ శైలిలో శ్రీనివాస వర్మ అద్వితీయులు. వీరి చిత్రాల్లో ప్రకృతి జీవకృతిగా పరిణమిస్తుంది. పాడుతుంది - తన విలాసాన్ని, సోయగాన్ని, వేదనను ప్రకటిస్తుంది.

ప్రకృతి ఒడిలో శిశువుగా పుట్టిన మనిషి ఆ ప్రకృతి మాత రూపలావణ్యాలను, విధ్వంసనం కావిస్తున్న రుద్ర భీభత్స చిత్రాలను శ్రీనివాసవర్మగారిలా, హృదయంగ మంగా, కళాత్మకంగా, తాత్విక దృక్పథంతో మరెవరూ చిత్రించలేదని చెప్పటం అతిశయోక్తి కాదు. వర్మగారి మేఘ- మిలన; నిసర్గరమణి; సస్యశ్యామల; శోకసుందరి; వియోగం, అనావృష్టి - మున్నగు చిత్రాలు అత్యంత హృదయాహ్లాదకరంగా ఉన్నాయి. భారతీయ కళా సంప్రదాయాన్ని జీర్ణించుకొన్న వర్మగారి చిత్రాలు, వేద, పురాణ ఉపనిషత్తుల రహస్యాలను అవగతం చేసుకొన్నాయి. కళారాధనమే జీవికగా నిర్ణయించు కొన్న వర్మగారి చిత్రాలు మన దేశంలోనే కాక విదేశాల్లోని అతిథి గృహాల్లో, సభాభవనాల్లో దర్శనీయాలై ఉన్నాయి.

## ఒకనాటి గొర్రెల కాపరిగా వర్మ

శ్రీనివాసవర్మ చదువు నాలుగవ తరగతి దాటలేదు. తండ్రిగారిచే దెబ్బలు తిన్న శ్రీనివాసవర్మ గొర్రెల మంద కాపలాదారునిగా వున్నాడు. రహదారికి ప్రక్కన దేవతల చిత్రాలు గీచి ప్రజల మన్ననలందు కొన్నాడు. ఈ వాస్తవం నేడు కట్టు కథగా కనిపించినా, నాలుగు దశాబ్దాల క్రితం ఆయన జీవితం అది.

·వర్మ కళాకారుల కుటుంబంలో జన్మించారు. బెంగుళూరు సమీపంలోని దేవనహళ్ళి సంప్రదాయ శిల్పకళకు పెట్టిన పేరు.

వర్మగారి తాత ప్రసిద్ధ శిల్పి చెన్నకేశవాచార్యులు. అవ్వగారైన శేషాంబ, తల్లి జయ లక్ష్మిగార్లు కూడా శిల్ప కళాభిజ్ఞులు. చిన్నాన్న విఖ్యాత శిల్పి ఎ.సి. హెచ్. ఆచార్య. వీరి వద్ద గురుకుల క్లిష్ట శిక్షణ తర్వాత బెంగుళూరు, మద్రాస్ మరెన్నో ప్రాంతాల్లో పర్యటన చేశారు. నఖ చిత్రకళలో కూడా ప్రావీణ్యం సంపాదించారు. భారతీయ సంప్రదాయ కళా సంప్రదాయాలను అధ్యయనం చేస్తూ దేవీ ప్రసాద్ రాయ్ చౌదరి, హుసేన్, నందలాల్‌బోస్, జామనీరాయ్, కె.కె. హెబ్బార్ మొదలగు ప్రముఖ కళాకారుల పరిచయం సంపాదించుకొన్నారు. ఇదంతా జరిగేటప్పటికి వర్మ వయసు 13 ఏళ్ళే!

నిరంతర సాధన, కళను గురించిన తపస్సు. బెంగుళూరు నగరంలో ఆంజనేయ కొండలోని పెద్ద బండరాళ్ళు వర్మగారిని ఆహ్వానించాయి. శిలల సహజ ఆకారాలను అనుసరించి శ్రీరామ పట్టాభిషేకం,

ఆంజనేయ మూర్తి వంటి బృహత్ చిత్రాల రచన చేశారు. జ్ఞాన పీఠ ప్రశస్తి గ్రహీత, సుప్రసిద్ధ సాహితీ వేత్త శ్రీమాస్తి వెంకటేశ అయ్యంగారు ఆచిత్రాలను చూసి ముగ్ధులై '' ఇది వట్టి కొండకాదు హనుమ గిరి'' అని ప్రశంసించారు.

కొంతకాలం పెద్ద పత్రికల్లో చిత్రకళాకారుడుగ పనిచేశారు. హిందీ చిత్రం 'ఆద్మీ', కన్నడ 'బంగారు జింక' వంటి సినిమాల్లో కళాదర్శకులుగ పనిచేశారు. వివిధ రంగాలలో పనిచేసిన వర్మ గారు ప్రస్తుతం బెంగుళూరు లోని, నాగావర ప్రాంతంలోని స్వంత ఇంటిలో చిత్ర రచనే జీవిత లక్ష్యంగా, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు, మనసిచ్చిన భార్య ( బి.ఎస్. శాంత) తో సంతోషంగా జీవిస్తున్నారు.

శ్రీనివాస వర్మ ప్రధానంగా 'పర్యావరణ చిత్ర కళాకారుడు. ఈ నేల, ఈ నీరు, ఈగాలి ఈ పచ్చిక బైళ్ళు ఇవే నాకు స్ఫూర్తి'. 'పరిసరాలే, మీ చిత్ర కళకు మూల ప్రేరకాలు', అంటున్నారు ప్రేరణ ఎలా కల్గింది? అన్న ప్రశ్నకు సమాధానంగా, '' ప్రపంచ జనాభా నానాటికీ విపరీతంగా పెరుగుతూ వుంది. భూమి, నీరు, గాలి, ధ్వని మున్నగునవి కలుషిత మవుతున్నాయి. వాటి ప్రభావంతో మానవుల మనసులు కూడా కాలుష్యానికి గురి అవుతున్నాయి. 'ఏమిటీ ఘోరం' అన్న ఆవేదన కలుగుతున్నది. మనిషి తన సహజ సంస్కృతిని విస్మరించి, విశ్వ మానవుడిగా ఎదుగుటకు బదులుగా విషమానవుడుగా మారుతున్నాడే అన్న ఆవేదనతో బాధ పడుతున్న నానుండి అందమైన శృంగార చిత్రాలెలా వెలువడుతాయి? పరిసర సంరక్షణా యజ్ఞ కార్యంలో కళాకారుడుగా నావంతు సేవలందించాలన్న సంకల్పం కల్గింది. ఈ ఆలోచనతో చిన్న చిన్న చిత్రాలకు బదులుగా 1000 అడుగుల చిత్రాల సృష్టికి పూనుకొని 'వియోగ' చిత్రరచన చేశాను.

## 1000 అడుగుల చిత్రాలే ఎందుకు ?

అదొక ఆకర్షణీయ దృష్టి. పురాతన కల్పనతో ఈ కలియుగాంతం దాకా జరిగే మార్పు చిత్రించుటకు అంత పెద్ద క్యాన్వాస్ కూడా చాలదు. వేయి అడుగుల చిత్రం ఒకేసారి చిత్రించను. దాన్ని భద్ర పరచేందుకు వీలుగా 10 అడుగుల పొడవు. 4 అడుగుల వెడల్పు గల వంద చిత్రాల సృష్టి జరగాలని సంకల్పించాను ఇందుకొక శాశ్వతమైన గ్యాలరి అవసరం ప్రస్తుతం 50 అడుగుల చిత్రం తయారైంది ప్రాయోజకులు ముందుకు రావాలి. వ్యక్తిగా నాకు అసాధ్యం.నా కృషికి అనూహ్య స్పందన లభించింది. మా పరిసరాల్లో ఇంటి పనులు చేసే 12 ఏళ్ళ బాలిక తన వంతుగ 12 రూపాయలు, పర్యావరణ చిత్రాల రచన కోసం పంపటం నాకమితాశ్చర్యం కల్గింది. ఒక పెద్ద పర్యావరణ చిత్ర రచనకు 10 వేల రూపాయలు (చెక్క, రంగులు, కాన్వాస్ మొ॥ వాటికి) ఒక చిత్రం పూర్తి చేసేందుకు నెలన్నర కాలం పడుతుంది. వస్తువుల కొనుగోలుకు ప్రజలు సహకరించాలి. ఇది వరకు కళాకారులు స్వయంగా సాహసించని రంగం ఇది. కళ ప్రజల హృదయాలను ఆకర్షించాలి. వివిధ దేశాల్లోని ప్రముఖ మ్యూజియంలలో వర్మగారి చిత్రాలున్నాయి. లలిత కళా అకాడమి పురస్కారంతో పాటు 90కి పైగా పురస్కారాలు అందుకొన్నారు. ప్రజల ఎదుటే చిత్ర రచన చేసే స్టార్ ఆర్టిస్ట్ శ్రీ వర్మ.

పరిసర చిత్రాల రచనకు ఆర్థిక సహాయం అందజేయదలచిన సహృదయులకు చిరునామా :

''బి. కె. ఎస్. వర్మ, 166/2, వర్ణసింధు ఆర్ట్ గ్యాలరి, నాగావర, బెంగుళూరు -45.

ఫోన్: 5447070.

( తరంగ 'కన్నడ వార పత్రిక సౌజన్యంతో)

# యక్ష ప్రశ్నలు మరో పది !

- సి. ధర్మారావు

అడిగే వాడికి చెప్పే వాడు లోకువ గదా! యక్షుడు ప్రశ్నలు వేస్తూనే వుంటాడు. అవసరంలో వున్న ధర్మజుడు సమాధానాలివ్వక తప్పదు. మీరూ ధర్మజుడి సాయానికి రండి.

1. లోకంలో మనుషులు రెండు రకాలు అనుకుంటే, ఆ రకాలు ఏవి?
క) పీడకులు, పీడితులు చ) ఆడ, మగ ట) ఎందులోనైనా ముందు మంచిని చూసేవాళ్లూ, చెడును చూసే వాళ్లూ

2. ఇంత వైజ్ఞానిక యుగంలోనూ దైవభావన పెరుగుతూనే వుంది, ఎందువల్ల ?
క) విజ్ఞానానికి, దైవభావనికి వైరుధ్యం లేదు చ) పాపం పెరుగుతున్నది ట) భయం, బాధల నుంచి బయట పడటానికి సామాన్యుడికి అంతిమ శరణ్యం దైవం

3. ఒకప్పుడు ఈ జంట పదాలు ఆంతర్యంలో కలిసిపోయి ఒకటిగావుండేవి. ఇప్పుడు బాగా దూరంగా జరిగి పోయిన జంట ఏది ?
క) నీతీ, జాతీ చ) ఆలనా, పాలనా ట) చదువూ, సంస్కారమూ

4. అట్లాగే, ఇంతకుముందు ఏ బాంధవ్యమూ లేకుండ, ఇప్పుడు మమేక మవుతున్న వాటిల్లో మరీ ముఖ్యమైనది ఏజంట ?
క) క్రికెటూ, దేశద్రోహమూ చ) రాజకీయుడు, గూండా ట) కాన్వెంటు బడి, దోపిడి

5. పాల్గొనే యిద్దరూ గెలవగలిగిన ఆట ఏది ?
క) పిల్లల బొమ్మరిల్లు ఆట చ) మాటలు ఆడటం ట) రతిక్రీడ

6. ఇన్ని సహస్రాబ్దాల అనుభవము వెనక వున్నా, మనిషికి సుఖం అందటం లేదు, ఎందుకని?
క) పేరుకే సంఘ జీవిగాని, మనిషిలో స్వార్థమే ఎక్కువ
చ) అందరికీ ఇంకా విద్య అందటం లేదు
ట) ఎవడూ రెండో వాడి అనుభవాన్ని స్వంతం చేసుకోలేడు

7. నగరవాసి ఆరోగ్యం ఎక్కువ చెడగొడుతున్నది ఏది ?
క) ఎయిడ్స్ చ) టి.వి. ట) వాహన కాలుష్యం

8. ఎక్కువ మందం కళ్లద్దాలు ఎవరు వాడతారు ?
క) ఇతరుల్లో తప్పులు వెతికే వాళ్లు చ) ఆర్క్ వెల్డింగు పనిచేసేవాళ్లు
ట) కాన్వెంటు పిల్లలు

9) మన రాష్ట్రం ఏటేటా ఏ అధిక ఛార్జీల బారిన ఎక్కువ పడుతున్నది ?
క) రైలు, బస్సు ఛార్జీలు చ) వంటగ్యాసు ట) కరెంటు

10) మన రాష్ట్రంలో ఏ కాటకం ఎక్కువ బాధిస్తున్నది ?
క) మంచినీరు చ) మామిడి పళ్లు ట) తెలుగు భాష

- షరా మామూలే న( ట)

# స్వీడన్ - ఒక స్వచ్ఛ స్మృతి

## (1945వ సంవత్సరపు నోబెల్ సాహిత్య పురస్కార అంగీకారోపన్యాసం)

మూలం: గేబ్రియాలా మిస్ట్రల్                    అనువాదం: డా॥ యు.ఎ.నరసింహమూర్తి

చిలీ అనే మారుమూల లాటిన్ అమెరికా దేశపు సంస్కృతిని లోకానికి వివరించిన అనేకులకు ప్రతీకగా నిలిచిన ఒక వ్యక్తిని స్వీడన్ ఈనాడు గౌరవించదలచుకున్నది. అమెరికా ఖండపు దక్షిణార్థ గోళాన్ని కూడా తన నాగరకతా సంరక్షక కేంద్రంలో ఇముడ్చుకున్న, జాతీయతా స్పృహ నధిగమించిన, ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆత్మకు ఈ చర్య తృప్తిని కలిగించగలదు. స్వీడన్‌కు చెందిన ప్రజాతంత్ర సంప్రదాయపు మౌలికత మానవ సమాజపు అత్యంత నూతన గవేషణలను నిరంతరం కొనసాగింప జేసేదిగా వుంది. చిలీ ప్రజాతంత్ర సంతతికి చెందిన దాన్నైన నేను స్వీడన్ ప్రజాతంత్ర సంప్రదాయపు ప్రతినిధిని నా యెదుట నిలుపుకున్నందుకు గర్విస్తున్నాను. స్వీడన్ ఇప్పుడు వర్తమానాన్ని అంగీకరిస్తూనే భవిష్యత్తువేపు దృష్టిని సారిస్తూంది. పురాతనమైన విలువల సారాన్ని సంపూర్ణంగా సంరక్షించుకుంటూనే మృత్యుశైత్యం నుండి సంప్రదాయానికి విముక్తిని కల్పించే ప్రశంసాత్మకమైన పనిని నిర్వహిస్తూంది. ఈ సాధన ఐరోపాకే గౌరవకారణంగా ఉంది. అమెరికా ఖండాన్ని ఉత్తేజపరచే ఉదాహరణంగా వుంది.

అనేక సందర్భాలలో నాకు సహాయపడిన స్వీడన్ దేశపు పురోగామి మేధావి వర్గానికి ఒక నూత్న ప్రజానీకపు దుహితృస్థానం నుండి నేను నమస్కరిస్తున్నాను. స్వీడన్ దేశపు భౌతిక - బౌద్ధిక స్వరూపాన్ని సుసంపన్నం చేసిన వైజ్ఞానికులను ఈ సందర్భంలో నేను సంస్మరిస్తున్నాను. విదేశీయులకు మార్గదర్శకంగా ఉండేలా ఆదర్శ పాఠశాలను తీర్చిదిద్దిన అసంఖ్యాక ఆచార్య - అధ్యాపక శ్రేణిని గుర్తుకు తెచ్చుకుంటున్నాను. రైతులు, వివిధ వృత్తులవారు, కార్మికులు వంటి స్వీడన్ దేశపు ఇతర వర్గాల ప్రజలను విశ్వాసపూర్వకమైన ప్రేమతో ఆలోకిస్తున్నాను.

ఒకానొక అన్వర్థ అదృష్ట రేఖా చాలనం ఈక్షణంలో నన్ను మీముందు నిలిపింది. ఇప్పుడు నేను చిలీ జాతి కవుల ప్రత్యక్ష స్వరాన్ని. ఉదారులైన స్పెయిను - పోర్చుగల్ కవుల పరోక్షవాణిని. శతాబ్దాల జానపద - కవితా సంప్రదాయాలు కల ఆ రెండు దేశాలు ఈ నార్డిక్ జీవన **(nordic life)** ఉత్సవాలకు ఆహ్వానింపబడినందులకు ఉబ్బితబ్బిబ్బవు తున్నాయి.

ఈ దేశపు వారసత్వం, నూత్నావిష్కారాలు, అమూల్య ప్రాచీన వైభవ పరిరక్షణా ప్రయత్నాలు, ప్రతి సవాలును అధిగమించగల సముద్ర సాంయాత్రికుల దృఢ విశ్వాసాన్ని పుణికి పుచ్చుకున్న వర్తమాన తీర్థాదీక్ష మహనీయమైనవి. ఆదర్శప్రాయమైన ఈ దేశాన్ని దేవుడు శాశ్వత బ్రహ్మకల్పంగా సంరక్షించు గాక!

నా మాతృభూమి స్వీడన్‌ను గౌరవిస్తుంది; ప్రేమిస్తుంది. తన కందించిన ప్రత్యేక పురస్కారాన్ని అంగీకరించమని నాదేశం నన్నిక్కడకు పంపింది. చిలీ తన స్వచ్ఛ స్మృతులలో మీ ఔదార్యాన్ని భద్రపరచుకుంటుంది.

## సమర్పణ

(హ్జాల్మర్ గుల్బెర్గ్ - స్వీడిష్ అకాడమీ సభ్యుడు)

ఆమెకు భాషే తెలియదు; భాష ఔన్నత్యమూ తెలియదు. గౌరవ సమాజం ఆమెను అవమానిస్తే

నిరంతర అశ్రుధారలను వర్షించింది. ఆ అశ్రుధారలు కవితాశక్తితో కలిసి ఒక భాష ఉన్నతిని పునరన్వేషించాయి, ఉజ్జ్వల వైభవాన్ని సాధించాయి. మధ్యధరా పవనముద్రతో సంకలితమైన ఇద్దరు కవులలో మొదటివాడైన ఫ్రెడరిక్ మిస్ట్రల్, అనే యువ విద్యార్థి తన తల్లి నిరంత రాశ్రువర్షం ప్రేరణగా ఫ్రెంచి భాషలో తన తొలి కవిత్వం రాసేడు. ఆ తర్వాత మిస్ట్రల్ 'మిరియో' (Mireio) అనే కావ్యాన్ని రాసేడు. ఒక ముగ్ధ కర్షక కన్యకు కార్మికునికి మధ్య నడచిన ప్రేమగాథను పునరున్మీలనం చేసే ఆ ఇతిహాసం పూలదారుల సౌరభంలో మందంగా ఉద్గమించి కఠిన మృత్యువుతో అంతమయింది. అందుచేత సంచారగాయక - కవుల పురాతన భాష మళ్ళీ కవిత్వపు భాష అయింది. 1904వ సంవత్సరపు నోబెల్ సాహిత్య పురస్కారం ప్రపంచం దృష్టిని ఈ సంఘటన వైపు మళ్ళించింది. ఆ తర్వాత పదేళ్ళకు ఫ్రెడరిక్ మిస్ట్రల్ మరణించేడు.

మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైన అదే సంవత్సరంలో (1914), ప్రపంచంలో ఇంకొక దిక్కులు పడ్డచోట, ఇంకొక మిస్ట్రల్ (Mistral) దర్శనమయింది. ఒక మృతునికి అంకితం చేసిన కొన్ని పద్యాలతో చిలీ దేశపు వనిత గేబ్రియాలా మిస్ట్రల్ అదే పురస్కారాన్ని అందుకొంది.

ఒక దేశం నుండి ఇంకొక దేశానికి పాకి దక్షిణ అమెరికా ప్రజలందరికీ బహుపరిచితమైన ఆమె కథ ఒక మరపురానిగాథ అయింది. దూరతీరాలను దాటి, అగాధ సముద్రాలను అధిగమించి ఇప్పుడామె మన వద్దకు చేరుకుంది. ఆ గాథను మనమిప్పుడు పునఃకథనం చెయ్యబోతున్నాము.

కొన్ని దశాబ్దాల క్రితం ఎల్విస్ లోయలో లూసిలా గొడొయి అల్కయాగా అనే భవిష్యదుపాధ్యాయిని జన్మించింది. ఆమె తండ్రిపేరు గొడొయి, తల్లిపేరు అల్కయాగా. వీరిద్దరూ బాస్కు జాతివారు. ఆమె తండ్రి ఉపాధ్యాయుడు. ఆయన తేలికగా పద్యాలల్లేవాడు. అతని సహజశక్తిలో కవుల్లో సామాన్యంగా కనబడే ఆతరుతా- అస్థిరత్వం కలిసి ఉండేవి. తాను పెంచిన చిన్న తోటను మాత్రం వదలి ఆయన తన కూతురు బాల్యదశలోనే ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. ఆమె తల్లి అందగత్తె; చాలా కాలం జీవించింది. ఒంటరియైన తన కుమార్తె తోటలోని పువ్వుల్తోను, పక్షులతోను ఎప్పుడూ ఎన్నో ఊసులాడుకుంటూ ఉండేదని ఆమె చెప్పింది. ఈ గాథలోని ఒక పక్షాన్ననుసరించి ఆ బాలిక పాఠశాల నుండి బహిష్కరింపబడింది. గంటలకొద్దీ తన మీద పాఠాలను రుద్దడం ఆమెకు విసుగనిపించేది, మూర్ఖంగా కనిపించేది. తనను తాను ఉపాధ్యాయినిగా మలుచుకునే పర్యంతం ఆమె తన పద్ధతుల్లో తనకు తానే చదువు చెప్పుకుంది. ఇరవై ఏళ్ల వయస్సులో ఒక రైలురోడ్డు ఉద్యోగితో ప్రణయంలో పడడంతో ఆమె గమ్యం నిర్దేశింపబడింది.

వాళ్ల ప్రేమ కథ మన కట్టే తెలియదు. అతడు ఆమెను మోసగించాడని మాత్రం తెలుసు. 1909 నవంబరులో ఒకనాడతడు తలలో కాల్చుకుని మరణించేడు. ఆ యువతిని అంతులేని నిర్వేదం ఆవరించింది. లోకాలు పగిలేలా ఆమె ఆక్రందించింది. చిలీ దేశపు గొడ్డు నేలల్లో అంతరించిన లోయల్లో నుండి నిర్దగ్ధ పర్వతశ్రేణుల వరకు ప్రతిధ్వనించిన ఆ రోదనను సుదూర ప్రాంతాల ప్రజలందరూ విన్నారు. దైనందిన జీవనంలోని ఒక పట్టింపులేని విషాద కథ తన వ్యక్తి లక్షణాన్ని కోల్పోయి విశ్వసాహిత్యంలోకి అడుగు పెట్టింది. అంతటితో లూసిలా 'గొడొయి అల్కయాగా' గేబ్రియాలా మిస్ట్రల్ మారింది. ఒక మారుమూల పాఠశాల ఉపాధ్యాయిని లాటిన్ అమెరికా హృదయాధి దేవత అయింది.

గేబ్రియాలా మిస్ట్రల్ మరణించిన తన ప్రియుని స్మృతిలో రాసిన కరుణ రసాత్మక కవితలు దక్షిణ అమెరికా అంతటా వ్యాపించి ఒక కొత్త కవయిత్రిని పరిచయం చేసేయి. 1922లో న్యూయార్క్‌లో నిర్వేదం (despair) అనే ఆమె కవితలు బృహత్ సంకలనం వెలువడింది. ఆ సంకలనం మధ్యలోని, పదిహేనవ పద్యంలో, ఎన్నటికీ జన్మించని తన మృతప్రియుని కుమారుని ఉద్దేశించిన ఒక తల్లి దుఃఖం వెల్లువలై పారింది.

గేబ్రియాలా మిస్ట్రల్ తన నిర్వ్యాజప్రేమను తన విద్యార్థుల మీదకు మళ్లించింది. ఆమె వారి కోసం రాసిన సరళగీతాల బృందగానం, సంపుటులు సౌకుమార్యం (tenderness) అనే పేరుతో 1924లో మాడ్రిడ్ (madrid) లో ప్రకటింపబడ్డాయి. ఆమె గౌరవార్థం ఒకప్పుడు మెక్సికోలో నాలుగువేల మంది బాలబాలికలు కలిసి ఆమె బృందగానాలను ఆలపించారు. గేబ్రియాలా మిస్ట్రల్ మాతృత్వపు కవయిత్రి అయింది.

స్పెయిన్ అంతర్యుద్ధ బాధితులైన పసివారి సహాయార్థం బ్యూనస్ ఎయిర్స్‌లో 1938లో 'తాళ' (TALA) అనే ఆమె కవితా సంపుటం వెలువడింది. 'నిర్వేదం' లోని కరుణ కాక 'తాళ' లో దక్షిణ అమెరికానంతటినీ పరివేష్టించి ఇక్కడిదాకా గుబాళించే ఒక విశ్వాంతరాళపు నిశ్శబ్దం వ్యక్తమయింది. మనం మళ్లీ ఆమె బాల్యపు పూలతోటలో ఉంటాము. ప్రకృతితో ఆమె ఊసులన్నీ మళ్లీ నాకు వినిపిస్తున్నాయి. వేద ఋక్కులు - పసివాళ్ల నిసర్గగీతాల వింత కలయిక అది. ఆ కవితలు మానవ జీవిత అనాది భాష్యాలు.

ఈ కవయిత్రి తన మాతృహస్తంతో మన హృదయదాహాన్ని ఉపశమించే మృత్తికాగంధ స్పర్శ నిండిన కవితాజలాన్ని అందించింది. గ్రీకుద్వీపాలలో శాఫోనుండి పరుగులెత్తిన ఆ ఊట ఎల్లిస్ లోయలో గేబ్రియాలా మిస్ట్రల్‌ను చేరుకుంది. కవిత్వపు ఊట ఎన్నటికీ ఇంకిపోదు.

మదామ్ గేబ్రియాలా మిస్ట్రల్! ఈ చిన్ని స్వాగత వాక్యాల కోసం మీరు చాలా దూరం ప్రయాణించారు. ఒక చిన్న ఉపాధ్యాయిని కుర్చీ నుంచి కవిత్వపు సింహాసనాల దాకా ప్రయాణించారు. సుసంపన్నమైన లాటిన్ అమెరికన్ సాహిత్యాన్ని ప్రస్తుతిస్తూ, విషాద - మాతృత్వాలను అద్భుతంగా గానం చేసిన 'నిర్వేదం' కవయిత్రిని - కవిత్వపు రాణిని గూర్చి ఈ రోజు మాకు మేము ప్రత్యేకంగా తెలుపుకుంటున్నాము.

స్వీడిష్ అకాడమీ మీకు అందిస్తున్న ఈ పురస్కారాన్ని, ఘనత వహించిన మా రాజుగారి చేతుల మీదుగా అందుకోవలసినదిగా కోరుతున్నాను.

## జీవిత చరిత్ర

గేబ్రియాలా మిస్ట్రల్ (1889 - 1957) కలంపేరు లూసిలా గొడాయియా అల్కయాగా, చిలీదేశంలో వికూనాలో జననం. ఊసుపోకకు కవిత్వమల్లిన వాని కుమార్తె. రైలురోడ్డు ఉద్యోగిని ప్రేమించి అతని మరణంతో ముడిపడ్డ తన ప్రణయాన్ని గూర్చి కవిత్వం రాసిన ఉపాధ్యాయిని. కవయిత్రిగా ప్రసిద్ధికెక్కేదాకా ప్రాథమిక - ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేసింది. మెక్సికో - చిలీ దేశాల విద్యా విధానాల రూపకల్పనలో గణనీయమైన పాత్రను నిర్వహించింది. నానాజాతి సమితిలో సాంస్కృతిక సంఘాలలో చురుకుగా పాల్గొంది. నేపిల్స్, మాడ్రిడ్, లిస్బన్‌లలో చిలీ రాయబారిగా పనిచేసింది. ఫ్లొరెన్స్, గ్వాటెమాలా విశ్వవిద్యాలయాలలో గౌరవ పట్టాలను పొందింది. చిలీ, అమెరికా

సంయుక్త రాష్ట్రాలు, స్పెయిన్, క్యూబాలలో అనేక సాంస్కృతిక సంఘాలలో గౌరవ సభ్యురాలిగా పనిచేసింది. అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో, మిడిల్‌బరీ కాలేజీ - వాసర్‌కాలేజీలలో ఇతరత్రా స్పానిష్ సాహిత్యాన్ని బోధించింది.

1914లో మృతప్రియుని స్మృతిలో వ్రాసిన ప్రణయగీతాలతో దక్షిణ అమెరికా అంతటా పేరు తెచ్చుకుంది. అయినా ఆమె మొదటి గొప్ప కవితా సంకలనం 'నిర్వేదం' (despair) 1922 దాకా ప్రచురితం కాలేదు. బాల్యం ప్రధాన వస్తువుగా 'సౌకుమార్యం' (tenderness) అన్న కవితా సంకలనం 1924లో వెలువడింది. బాల్యానికి మాతృత్వాన్ని జోడించిన 'తాళ' '(Tala) అన్న కవితా సంకలనం 1938లో వెలువడింది. ఆమె కవిత్వమంతా కలిపి 1958లో ప్రచురించ బడింది.

*Continued from Page No. 226*

# STUPID

Then there was the time when I was riding a bicycle and was asked, "Are you riding a bicycle?" I looked up as innocently as the questioner on her moped and, giving her a puzzled look, asked her if she was talking to me. Since there was no-one else around and she happened to be a close family friend my counter stupid-question had the desired effect. She was embarrassed. I smiled. The conversation resumed. She's one of the few who's been careful after that – at least with me.'

Despite my rejoinders, my ignoring his questions, my imploring, my threats, my abuses, my curses, and my quarrels, my best friend is one of the most incorrigible creatures I have come across as far as asking stupid questions is concerned. "Persistence and perseverance" seems to be his motto in this particular field. His rhetorical questions and his question tags are exasperating enough but his "stupid-questions" are simply unbearable. The other day he suddenly barged into my room, as excited as an elephant in heat, and seeing me sipping a coke, remarked, "What're you doing?" The sudden, noisy entry and question shook my hand and some coke fell on my shirt and trousers. The only reply I could give on the spur of the surprised moment was a disgruntled grunt.

"Having a coke?" He was nonchalantly calm.

"No, spilling it on myself".

"Why?" A genuinely puzzled expression replaced the unconcerned look. I pulled out my hair in exasperation.

But then, this is not a habit which is easy to kick as, for centuries, Indians have a perfected this art. It is said that as far back as the 16th century Birbal "proved" to Emperor Akbar that the population of Delhi was either exceptionally dimwitted or blind. He started weaving cloth in the middle of the highway and anyone who passed by would invariably ask him. "Birbal, what are you doing?" It appears that even after more than 450 years we all remain either stupid or blind or both.

*The author is Senior Lecturer of English, SD College, Hoshiarpur.*

# ఆధునికానంతర మనో వైజ్ఞానిక శాస్త్రవేత్త జాక్‌లకా

(గత సంచిక తరువాయి)

- బి. తిరుపతిరావు

ఫ్రాయిడ్ అచేతన క్రమాన్ని సంక్షిప్తీకరణ **(condensation)**, స్థానభ్రంశం **(displacement)** అనే రెండు అంశాల్లో వివరించాడు. లకా కూడా అచేతనాన్ని వివరించటంలో వీటిని ఉపయోగించాడు. ఈ రెండు పదాలకి భాషకి వున్న సంబంధాన్ని విశ్లేషించాడు. సంక్షిప్తీకరణ, స్థానభ్రంశం రెండు భాషా సంబంధ భావనలు. రెండింటిలో అర్థం సంక్షిప్తీకరించబడటం, స్థానభ్రంశం చెందటం జరుగుతుంది. మొదటిది మెటఫర్ రూపంలో జరిగితే, రెండవది మెటానమిక్ రూపంలో జరుగుతుంది. అందువల్ల అచేతనం అనివార్యంగా భాషా నిర్మాణాల ఎరుకలో వుంటుంది. నిజానికి ఫ్రాయిడ్ చేసిన స్వప్న విశ్లేషణల్లో, అచేతనపు ప్రతీకల్ని వివరించటంలో ఆశ్రయించింది కూడా భాషనే.

భాషని కేంద్రంగా చేసుకుని అచేతనాన్ని వివరించే క్రమంలో లకా సాస్యూర్ భాషా శాస్త్రంమీద ఆధారపడతాడు. అయితే సాస్యూర్ ప్రతిపాదనల్లో కొన్నింటిని లకా సవరిస్తాడు. ఈ విషయాన్ని గుర్తించే లకాను గురించి ఒక విమర్శకుడు ఇలా అన్నాడు - **"You might think of Lacan as Frued + Soussure, with a dash of Levi - strauss, and even some reasoning of Devida".**

నిర్మాణవాద భాషా శాస్త్రవేత్త సాస్యూర్ సంకేతికం **(signifiar)** సంకేతితం **(signified)** మధ్య సంబంధంలోంచి సంకేతం **(sign)** ఎలా రూపొందుతుందో వివరిస్తాడు. ఇందుకు భిన్నంగా లకా సంకేతి కాలమధ్య సంబంధాన్ని గురించి మాత్రమే దృష్టిసారిస్తాడు. అచేతనంలోని వాంఛలు, ప్రతిమలు మొదలయినవి సంకేతికాలుగా రూపొందుతాయి. ఈ సంకేతికాలన్నీ కలిసి ఒక సంకేతీకరణ గొలుసుగా వుంటాయి. ఒక సంకేతికం వేరొక సంకేతికంగా వుండక పోవటంవల్ల అర్థాన్ని పొందగలుగుతుంది. సంకేతితాలు అనేవి వుండవు. ఎందుకంటే సంకేతికాలు సూచించేది అంతిమంగా మళ్ళీ సంకేతికాల్నే. అందువల్ల అంతి అర్థం అనేదానికి ఆస్కారం లేదు.

సంకేతికం ఎప్పుడూ సంకేతితం నుండి విడిగా వుంటుంది. స్వయం ప్రతిపత్తిలో వుంటుంది. ఏ సంకేతికం ఒకే సంకేతితంమీద స్థిరంగా వుండిపోదు. సంకేతికాల క్రమం నిరంతర క్రీడని ముందుకు తెస్తుంది. ఈ క్రీడని ఆపటం అసాధ్యం. నిఘంటువులో ఒక పదం వేరొక పదానికి దారితీసినట్టుగా ఒక సంకేతికం వేరొక సంకేతికానికి దారితీస్తుంది. నిరంతరం ఒక సంకేతికాన్నించి వేరొక సంకేతికానికి జారిపోతున్న క్రమంలో ఆక్రమాన్ని నిలుపు చేసే లంగరు కానీ, కేంద్రంకానీ ఏదిలేదు. అచేతనం ఒక **flux**. గతంలో భావించినట్టుగా అచేతనం అస్తవ్యవస్థ అంశాల సమాహారం కాదు. అది ఒక సంక్లిష్ట భాషా వ్యవస్థ. మనో వైజ్ఞానికశాస్త్ర అనుభవంలోంచి చూసినప్పుడు అచేతనం మొత్తం భాషా నిర్మాణం లాగానే వుంటుంది. లకా ఇట్లా అంటాడు - **'How could a psychoanalyst of today not realise that his realm of truth is in fact the word?'**

శిశువు భాషా ప్రపంచంలో ప్రవేశించిన తరువాత మాత్రమే అచేతనం రూపొందుతుంది. లోతుగాచూస్తే ప్రపంచం అనేది కూడా భాష వల్ల మన గ్రహణలోకి వస్తుంది. మనం వాస్తవికత

అనేదికూడా భాషా ఫలితమే. సంకేతాలు లేక పదాలు మనం వాస్తవికతని గ్రహించే విధానాన్ని నిర్దేశిస్తాయి. అందువల్ల భాషా ప్రపంచంలోకి మనం ప్రవేసించిన తరువాత వాస్తవికత అనేది మన గ్రహణలోకి వస్తుంది. తత్వశాస్త్రంలో ప్రపంచాన్ని భావవాదులు ఆలోచనా ఫలితంగా చూస్తే, భౌతికవాదులు పదార్థ ఫలితంగా చూస్తారు. ఈ రెండింటికి భిన్నంగా లకా ప్రపంచాన్ని భాషా ఫలితంగా చూస్తాడు.

మనిషి వాంఛలు, స్వైర కల్పనలు భాషా నిర్మాణాలలోంచి, భాషా నిర్మాణాల గుండా రూపొందుతాయి, పని చేస్తాయి. అయితే ఈ నిర్మాణాలు ఒక వ్యక్తి చేతనాపూరిత మాటల్లో, పలుకుల్లో **(utterences)** కన్పించవు. అచేతనంలో అవి దాగివుంటాయి. ఉదాహరణకి ఒక మానసిక శాస్త్రవేత్త మానసిక రుగ్మతతో వున్న వ్యక్తిని ప్రశ్నిస్తున్నప్పుడు ఆ వ్యక్తి బయటకు చెప్పే సమాధానాల మీద ఆధారపడకూడదు. అతను చెప్పకుండా వదిలివేస్తున్న అంశాలమీద దృష్టికేంద్రీకరించాల్సి వుంటుంది. ఎందుకంటే అచేతనం సెన్సార్ చేయబడిన అధ్యాయం లాంటిది. చేతనాపూరిత ప్రపంచం సంక్షిప్తీకరించబడిన దాని పాఠాంతరం. మనో విశ్లేషకుడు ఈ సెన్సార్ చేయబడిన అంశాల్ని గురించి ఆలోచించాలి. కాబట్టే లకా ఒక భాషణపు **(speech)**, విషయం **(content)** మీదకాక దాని నిర్మాణం **(structure)** మీద దృష్టి సారించాలంటాడు. సంప్రదాయ విశ్లేషకులు ఒక భాషణంలోని పదాలు ఇచ్చే సందేశాలమీద ఆదారపడి పదాల పునాదుల్ని పట్టించుకోరు. ఈ పునాదుల్ని గురించి లోతుగా ఆలోచించినప్పుడు మాత్రమే అచేతనం నిజంగా ఏమి కోరుకుంటుందో మనకు అంతుబడుతుంది. నిజానికి భాషని ఉపయోగించేది, మాట్లాడేది చేతన కాదు అచేతనం. ఈ నేపథ్యంలో ఈగోకి అచేతనం మీద పూర్తి ఆధిపత్యం వుంటుందనే భావం ఒట్టి భ్రమగానే మిగులుతుంది.

శిశువు తప్పని సరిగా ప్రయాణించాల్సిన మూడు దశల్ని ఫ్రాయిడ్ ప్రస్తావించాడు. అవి: **oral, anal, phallic.** ఈడిపస్ కాంప్లెక్స్, కాస్ట్రేషన్ కాంప్లెక్స్‌లు శిశువుని ఈ మూడు దశల్నించి బయట పడవేసి శిశువుని వయోజన **(adult)** దశలోకి ప్రవేశపెడతాయి. శిశువు వయోజనుడుగా పరిణితి చెందే క్రమంలో లకా కూడా మూడు వర్గీకరణలను ప్రస్తావిస్తాడు; అవసరం **(need)**, డిమాండ్, వాంఛ **(desire)** అనేవి. ఈ మూడు పదాలు వాస్తవ **(real)**, ఊహాత్మక **(imaginary)**, ప్రతీకాత్మక అనే మూడు దశల్ని సూచిస్తాయి. మూడవదైన ప్రతికాత్మక దశ వయోజనత్వానికి సమానం. మరింత నిర్దిష్టంగా చూస్తే ప్రతీకాత్మకరంగం అనేది భాషా నిర్మాణమే. ఈ నిర్మాణంలో ప్రవేసించటం ద్వారానే మనిషి విషయి **(Subject)** గా పరివర్తన చెందుతాడు. 'నేను' అనే చేతన లేక స్పృహ ఇక్కడే కలుగుతుంది.

లకా ప్రతిపాదన ప్రకారం ఒక శిశువు తనకి, తన తల్లికి మధ్య విభిన్నతని గుర్తించలేదు. తమిద్దరు రెండు విడివిడి శరీరాలు అనే భావం శిశువుకు వుండదు. అహం **(self)**, పరాయి **(other)** అనే స్పృహ శిశువుకు వుండదు. ఈ స్థితిలో శిశువు ఒక మాంసపు ముద్ద **(blob)** లాంటిది. ఈ ముద్దకి అహం, గుర్తింపు వుండవు. అసలు శరీర స్పృహే వుండదు. శిశువు అనబడే ఈ మాంసపు ముద్ద తనకే తెలియని అవసరం **(need)** చేత నడపబడుతుంది. ఆహారం, రక్షణా దాని అవసరాలు. ఈ అవసరాల్ని కొన్ని వస్తువులు తీర్చుతుంటాయి. ఆకలేసినప్పుడు మాతృ స్తన్యం, లేక పాలసీసా, రక్షణకి తల్లి కౌగిలి ఉపయోగపడుతుంటాయి. ఈ అవసరపు స్థితిలో శిశువు తనకి తన అవసరాలు తీర్చే వస్తువులకి మధ్య తేడా గ్రహించలేదు. అసలు ఆ వస్తువులు, తాను వేరనే స్పృహ దానికి వుండదు. శిశువు ప్రపంచంలో

వుండేది చేతనారాహిత్య స్థితి. తన వెలుపల తన అవసరాల్ని తీర్చుతున్న ఒక సంపూర్ణమూర్తి (whole person) వుందనేది దానికేమాత్రమూ తెలియదు. ఇదొక ప్రాకృతిక స్థితి (state of nature). ఈ స్థితి నుంచి బయటపడి మాత్రమే శిశువు క్రమంగా సంస్కృతిని చేరుకోగలుగుతుంది, నాగరకతలోకి ప్రవేసించగలుగుతుంది.

శిశువుకి తను తన తల్లి వేరు వేరనే భావం కలిగి ప్రత్యేక గుర్తింపుని రూపొందించుకునే క్రమంలో అది ఒక అనివార్య నష్టాన్ని (Loss) ఎదుర్కోవాల్సి వుంటుంది. తన ఎరుకలోంచి తాను వ్యక్తిగా గుర్తింపుని ఏర్పరుచుకొనే క్రమంలో అప్పటిదాకా దానికి వున్న ప్రాథమిక ఐక్యతాభావన (sense of unity), దానితో పాటే అప్పటిదాకా అదిపొందిన రక్షణ మొదలయిన వాటిని అది కోల్పోవాల్సి వస్తుంది. నాగరకతలోకి ప్రవేసించటానికి మనిషికి మౌలికంగా వున్న ఈ అంశాన్ని కోల్పోవాల్సి వస్తుంది. ఇదొక విషాదం.

తల్లినుంచి వేరుపడని, గుర్తింపుని ఏర్పరుచుకోని, తనకి తన అవసరాలు తీర్చుతున్న వస్తువులకి మధ్య తేడా గ్రహించలేని స్థితిలో శిశువు వుండేది వాస్తవ (real) రంగం అంటాడు లకా. వాస్తవిక రంగం అనేది సహజమైన ఐక్యత (original unity) వుండే భౌతికం కానీ ఒకానొక మానసిక స్థలం. ఇక్కడ లేకపోవటం (lack) అనేదిలేదు. వాస్తవం (real) సంపూర్ణం. సంతృప్తి పర్చబడని వాంఛకి ఇక్కడ ఆస్కారం లేదు. ఇక్కడ అనుపస్థితి (absence) లేని తనం లేకపోవటం వల్ల భాషనేది కూడా ఈ స్థితిలో వుండదు. స్థూలంగా చెపితే వాస్తవ దశలో భాష అనేది లేదు.

భాష యొక్క అవసరం ఎప్పుడు కూడా ఒక అనుపస్థితిలోనో, లేని స్థితిలోనో తలెత్తుతుంది. (language is always about loss or absence) మనం కావాలనుకున్న వస్తువు, అంశం మన దగ్గర లేనప్పుడు మాత్రమే భాష అవసరమౌతుంది. వస్తువుమన చేతిలో వున్నప్పుడు ఆ వస్తువుని సూచించే పదంతో పనిలేదు. ప్రపంచంలో అనుపస్థితి అనేది లేకపోతే భాషతో పనే లేదు. జొనాథన్ స్విఫ్ట్ తన 'గలివర్ ట్రావెల్స్' లో భాషలేని సంస్కృతినొక దాన్ని ప్రస్తావించి ఆ సంస్కృతిలో ప్రజలు తాము ప్రస్తావించదల్చుకున్న వస్తువుల్ని వీపులమీద మోసుకు రావటం గురించి మనం చదివాం. అసలు విషయం వాస్తవ దశ భాషకి అతీతంగా వుంటుంది. దాన్ని భాషద్వారా ప్రాతినిధ్యంలోకి తేవటం జరగదు.

ఒక శిశువు అవసర, వాస్తవ దశలు రెండూ ఆరు నుంచి పద్దెనిమిది నెలల వయస్సులోపు గడిచిపోతాయి. ఆ తరువాత శిశుశు తనకి మిగతా ప్రపంచంలోని వస్తువులకి మధ్యతేడాని గ్రహించ ప్రారంభమవుతుంది. ఈదశలో శిశువు అవసరం నుంచి దూరమయి డిమాండ్ చేయటం మొదలు పెడుతుంది. ఈ డిమాండ్‌లను వస్తువులతో తీర్చటం కుదరదు. ఒక డిమాండ్ ఎప్పుడూ కూడా గుర్తింపు కోసం, ప్రేమకోసం డిమాండ్‌గా వుంటుంది. శిశువు ఎప్పుడయితే తాను తన తల్లి నుంచి, మిగతా వస్తువుల నుంచి వేరూగా వున్నాననే స్పృహను ఏర్పర్చుకుంటుందో ''పరాయి'' (other) గురించిన భావన దానికి ఏర్పడుతుంది. ఈ ఎడబాటు బావన, 'పరాయి' గురించిన ఎరుక ఒకానొక 'ఉత్కంఠతకి, నష్టానికి సంబంధించిన భావనకి దారి తీస్తాయి. వీటినుంచి బయటపడి తను సంపూర్ణత్వంలో,

ఎడబాటు లేని స్థితిని పొందిన వాస్తవిక స్థితిలోకి తిరిగి పోవాలని డిమాండ్ చేస్తుంది. వాస్తవిక స్థితిలోకి తిరిగిపోవటం అసాధ్యం, ఎందుకంటే అప్పటికే శిశువు 'పరాయి' గురించిన ఎరుక ఏర్పడిపోయింది. ఆ క్షణం నుండి శిశువు తాను తన వాస్తవిక స్థితిలోకి పోవటానికి అడ్డంగా వున్న పరాయి అంతర్ధానం కావాలనుకుంటుంది, దాన్నే డిమాండ్ చేస్తుంది. (ఇదంతా అచేతనంగా జరుగుతుంది). డిమాండ్ ఇక్కడ సంపూర్ణత్వాన్ని చేరుకోవటానికి డిమాండ్‌గా వుంటుంది. అయితే శిశువు వాస్తవ స్థితిని చేరుకోవటం అసాధ్యంగానే మిగులుతుంది. శిశువు విషయిగా, అహంగా, సాంస్కృతిక జీవిగా రూపొందటానికి అనుపస్థితిని, లేనితాన్ని, 'పరాయి' ని గుర్తించటాన్ని అనివార్యంగా ఎదుర్కోవాల్సి వుంటుంది.

శిశువుకి తన డిమాండ్‌ని వ్యక్తం చేసే శక్తి వుండదు. శిశువుకి 'పరాయి' అస్తిత్వంలో వుందనే విషయం తప్ప, తాను 'పరాయి' నుంచి వేరుగా వున్నాననే విషయం తప్ప తన అహాన్ని గురించిన స్పృహ ఏమీ వుండదు. ఈ స్థితిలోనే శిశువు దర్పణదశ(mirror stage) లోకి ప్రవేశిస్తుంది. ఇప్పుడు శిశువు వయస్సు 6 - 18 నెలల మధ్య వుంటుంది. ఇంకా అప్పటికి శిశువుకి తన శరీరం మీద ఆధిపత్యం ఏర్పడివుండదు. తన కలయికల మీద తనకి ఆధిపత్యం, నియంత్రణ వుండవు. తన శరీరం సమగ్రమనే భావన కూడా ఈ శిశువుకు వుండదు. శకలమయంగానే శిశువుకి తన శరీరం అనుభవంలోకి వస్తుంది. తన శరీర అంగాల్ని చూసినప్పుడు కూడా అవి తన శరీరంలో భాగాలనే స్పృహ దానికి వుండదు. ఇది భాషారహిత స్థితి. 'enfans' అనే పదం నుంచి రూపొందిన 'infant'కి అర్థం భాష లేనిదనే అర్థం. శిశువుని తల్లి లేక ఇంట్లోవాళ్ళు అద్దం ముందు నిలిపినప్పుడు అద్దంలో తన ప్రతిబింబాన్ని తన అహంతోనూ, తనని అద్దంముందు నిలిపిన వ్యక్తి ప్రతిబింబంతోనూ గందరగోళపర్చుకుంటుంది. క్రమంగా శిశువు అద్దంలో ప్రతిబింబం తనదేనని గ్రహిస్తుంది. తనని తాను ఐక్యజీవి (unified beeing)గా భావిస్తుంది. ఈ భావన శిశువుని క్రమంగా భాషా వ్యవస్థలోకి ప్రవేశపెడుతుంది. తాను ఐక్యజీవిననే గుర్తింపునుంచి అహం రూపొందుతుంది. భాష, సంస్కృతిలాంటి ఇంకా అనేక ప్రతీకాత్మక అంశాలు ముందుకు వస్తాయి.

ఈ దర్పణ దశలో శిశువు అద్దంలో తన ప్రతిబింబాన్ని, తల్లి వాస్తవ శరీరాన్ని మార్చి మార్చి చూసుకుంటుంది. క్రమంగా ఈ స్థితిలో శిశువుకు తనుకూడా తల్లిలాగానే ఒక సమైక్య, సమగ్ర జీవిననే స్పృహ కలుగుతుంది. కనీసం తనని తాను సమగ్రజీవిగా ఊహించుకుంటుంది. తన శకలమయం అనే భావన నుంచి బయటపడుతుంది. తాను ఇతరులులాగా వున్నాననే ఎరుకలోకి వస్తుంది. ఇది క్రమంగా అహం (self) రూపొందటానికి, 'నేను' అనే చైతన్యం రావటానికి దారి తీస్తుంది. అయితే ఈ స్థితిలో శిశువుకు కలిగే తప్పుడు గుర్తింపే. శిశువు తనని తాను గుర్తించుకుంది తన వాస్తవ శరీరంతో కాదు ప్రతిబింబంతో. అందువల్లే ఈ గుర్తింపు తప్పుడు గుర్తింపు (misrecognition). శిశువు 'నేను' అనుకునేది తను కాదు, తన ప్రతిబింబం మాత్రమే. అయితే ప్రక్కనున్న తల్లి శిశువు తప్పుడు గుర్తింపును సమర్థిస్తూ ఖాయపర్చుతుంది. అందువల్ల శిశువు నమ్మకం బలపడుతుంది. తల్లి శిశువుకి అద్దంలో ప్రతిబింబం చూపిస్తూ అది శిశువు ప్రతిబింబంగా పదే పదే చెపుతూ వుంటుంది. అందువల్లే తన గుర్తింపు సరైనదని శిశువు నమ్ముతుంది.

అద్దంలో తన ప్రతిబింబం నుంచి తాను ఏర్పరుచు కున్న గుర్తింపు అహం (self) ఏర్పడటానికి కారణమై అది ఈగో (ego) గా స్థిరపడుతుంది. అంతిమంగా అహం అనేది శిశువు రూపొందించుకున్న ఒక భ్రమ. అయితే ఈ భ్రమ శకల మయంగా తనని తాను చూచు కున్న శిశువుకి ఒక రక్షణ కవచం అవుతుంది. ఈ కవచం వల్లే శిశువులో సమగ్రత, సమైక్యత, సంపూర్ణత అనే భావనలు ఏర్పడతాయి. అందువల్లే లకా ఈ నేపథ్యంలో ego, self, I అనే వాటిని స్వైర కల్పన (fatosy)గా చూస్తాడు. ఈ స్వైర కల్పనతో నిండిన ఈ దశని లకా ఊహాత్మక రంగం (realm of the inmaginary) అంటాడు. ఈ స్థితిలో చేతనగానైనా, లేక అచేతనంగా నయినా ప్రముఖ పాత్ర వహించేది ప్రతిమలే (images). ఇది భాషకి ముందు స్థితి (prelinguistic), ఈడిపల్ దశకి ముందుస్థితి. ఇది మొత్తం దృశ్య సంబంధ దృక్కోణం (visual per caption) మీద ఆధారపడి వుంటుంది.

దర్పణ దశలో శిశువులో రూపొందే అహాన్ని లేక ఈగోని ఆదర్శపూరిత అహం (ideal ago) అంటారు. ఈ ఆదర్శ అహాన్ని శిశువు అంతరంగీకరించుకుంటుంది. సంపూర్ణ అహం, ఐక్య అహం, స్థిర అహం అనే భావనలో దీని ఫలితంగానే రంగం మీదకి వస్తాయి. నిజానికి ఇవన్నీ కల్పితాలు. వాస్తవస్థితిలో తల్లినించి వేరుపడటం ద్వారా శిశువు లేక మనిషి కోల్పోయిన ఐక్యతని, సమగ్రతని ఈ కల్పనలతో పూరించుకుంటాడు. ఈ విషయాన్ని గురించి ఒక విమర్శకుడు ఇలా అంటాడు - **"We lose our identity with the mother's body, the state of nature, in order to enter culture, but we protect ourselves from the knowledge of that loss by misperceiving ourselves as not lacking anything - as being complete unto ourselves".**

శిశువులో ఆదర్శ అహం క్రమంగా నార్సిజానికి దారితీస్తుంది. ఇది బాల్యానికి మాత్రమే పరిమితం కాదు. ఆ తరువాత కూడా కొనసాగుతుంది. ఇంతకుముందు చెప్పుకున్నట్లుగా ఊహాత్మక అచేతన ప్రపంచంగా పరిణమిస్తుంది. ఈగో ముందుకు తెచ్చే భ్రమలకి, వంచనలకి ఈ ఊహాత్మరంగమే మూలాధారమౌతుంది. ఈ విషయాన్ని గుర్తించిన మానవతావాద మనో వైజ్ఞానికులు గుర్తింపు, సమైక్యత, సమతౌల్యం, selfhood లాంటి పదాల్ని వుపయోగిస్తుంటారు. తద్వారా వాళ్ళు మనిషికి కొన్ని స్థిర లక్షణాల్ని, ప్రవృత్తుల్ని అంటగడుతూ 'humanistic man' ముందుకు తెస్తారు.

శిశువులో అహం గురించిన భ్రమ ఏర్పడటం ద్వారా అది పరాయిని గురించిన భావాన్ని రూపొందించుకుంటుంది. అద్దంలో తన ప్రతిబింబాన్ని 'పరాయి'తో తన అహాన్ని గుర్తించుకుంటుంది. ఆ తరువాత శిశువు ప్రతీకాత్మక రంగంలోకి లేక దశలోకి ప్రవేశిస్తుంది. ఒక రకంగా ఊహాత్మక దశ, ప్రతీకాత్మక దశ కలగలిసిపోయి వుంటాయి. రెండింటిని విడదీసి చూడటం సాధ్యం కాదు. ప్రతీకాత్మక దశ అంటే భాషా వ్యవస్థ. మాట్లాడే విషయి (speaking subject) గా ఎదగటానికి, 'నేను' అని ప్రకటించుకోవటానికి ఈ ప్రతీకాత్మ దశలోకి ప్రవేశించటం అనివార్యం. ఈ సందర్భంలో భాషకి సంబంధించిన ప్రస్తావన మళ్ళీ అవసరం.

ప్రతీకాత్మక రంగం లోనే శిశువు వ్యక్తిగా, విషయిగా రూపొందుతుంది. లకా దృష్టిలో భాష లేకుండా మానవ విషయి (human subject) వుండే వీలు లేదు. అంతమాత్రం చేత లకా విషయిని భాషగా కుదించలేదు. వృత్తాకారంగా వుండే భాష - విషయిల సంబంధంలో భాషకి విశేషాధికారాన్ని ఇచ్చాడు లకా. ఒక దశలో 'There is no subject independent of language' అంటాడు లకా. లకాకి ముందున్న మనోవైజ్ఞానిక శాస్త్రవేత్త లందరూ శరీరాన్ని మాత్రమే కేంద్రం చేసుకుని ఆలోచిస్తూ భాషని పూర్తిగా విస్మరించారు. ఈ క్రమాన్ని నిరాకరిస్తూ లకా భాషకి పట్టం కడతాడు. మనమంతా భాషలో మునిగిపోయాం. మనల్ని మనం భాష ద్వారానే వ్యక్తీకరించుకోవాలి. ఇతరులతో సంపర్కానికి మనకున్న ఏకైక సాధనం భాష.

సమకాలీన స్త్రీవాద సిద్ధాంత రంగంలో లకా వివాదాస్పదంగా నిలిచాడు. అయితే చాలామంది స్త్రీవాదులు శిశ్నకేంద్రక (phallocentric) జ్ఞాన సిద్ధాంతాల్ని సవాలు చేయటంలో లకా భావనల్ని ఉపయోగించుకున్నారు. విషయత్వం, భాష, లైంగికత మొదలయిన రంగాల్లో అమలవుతున్న పితృస్వామిక భావాల్ని విశ్లేషించి ఖండించటానికి లకా ఉపయోగపడ్డాడు. హేతుబద్ధవిషయి, చేతనా పూరిత విషయి, హేతుబద్ధ ప్రవచనం, సహజలైంగికత మొదలైన వాటిని గురించి అమలులో వున్న సంప్రదాయ నిర్వచనాలమీద లకా చేసిన దాడి, విశ్లేషణ స్త్రీవాదులకి ఉపయోగపడింది. అయితే కొంతమంది స్త్రీవాదులు లకా పరిమితుల్ని గురించి మాట్లాడారు. జూలియట్ మిచల్ (Juliet Mitchel), జూలియా క్రిస్తీవా (Juleia Kristeva), ఎల్లిరాగ్‌లాండ్ - సల్లివాన్ (Elli Ragland Sullivan), కాథరిన్‌క్లెమెన్ట్ (Catherine Clement) లాంటివాళ్ళు లకా ప్రేరణతో తమ విశ్లేషణలు చేశారు. జర్మన్ గ్రేయర్ (Germain Greer), డెల్ స్పెండర్ (Dale Spender) లాంటివాళ్ళు లకాని నిరాకరించారు.

ఉపయుక్త గ్రంథాలు :


1. Lacan - Malcolm Bowie, Fontana Press, 1991
2. Subjects of Desire : Hegelian Reflection in 20th Centtury France - Judith Butler, Columbia University Press, 1987
3. Post - Structuralism and Postmodernism - Madam Samp, University of Georgia Press, 1993.
4. Jacques Lan and the Philosophy of Psychoanalysis Elli Ragland - Sullivan, University of Illinois Press.
5. The Title of the Letter : A Reading of Lacan - Jean - Luc Namcy, Philippe Lacouse - Laborthe, State University of New York Press, 1992.
6. Psychoanalysis and Soci al Sheams - I am craib, University of Massachusetts Press, 1990.

# ప్రాచీన భారతం - భూస్వామ్య వ్యవస్థ

- శివలింగం

భారతదేశంలో భూస్వామ్య పద్ధతి వుందా అనే విషయం మీద చరిత్రకారులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రాచీన భారతీయ సమాజ వ్యవస్థకు మధ్యయుగ యూరపు సమాజ వ్యవస్థకు పోలికలు వున్నాయని అందుకని ఫ్యూడల్ పదానికి అర్థం సరిగా అవగాహనచేసుకొనకుండా భారతీయ చరిత్రలో ఫ్యూడల్ వ్యవస్థ వుందని చెప్పడం జరిగింది. ఇతిహాసయుగంలో ఫ్యూడల్ వ్యవస్థలేదు. తరవాత వేయి సంవత్సరాలకు గాని ఫ్యూడలిజం అభివృద్ధి చెందలేదు. ఇతిహాస యుగంలో ఫ్యూడలిజం లేనపుడు తరవాత కాలంలో ఫ్యూడలిజం అభివృద్ధి చెందడానికి కారణాలు వెతకాలి. చిరకాలం నుండి రామాయణ భారతాలు హిందువులను ఆకర్షిస్తూనే వున్నాయనడంలో సందేహం లేదు. హిందువులకు ధర్మశాస్త్రాలను ముఖ్యంగా మను ధర్మ శాస్త్రం పరమ ప్రామాణికంగా అంగీకరించారు. ఇతిహాసాల్లో పేర్కొన్న వ్యవస్థలు. ఆచారాలు తరవాత వొదిలేశారు. నియోగపద్ధతి తరవాత కాలంలో లేదు. ఇతిహాస కాలంలో జరిగిందంతా తప్పు అని హిందువులు అనుకోలేదు. ఇతిహాసయుగ వ్యవస్థ తరవాత చరిత్రలో దాని ప్రభావం అంచనావేయాలి. ప్రథమంగా జేమ్సుటాడ్ అనే చరిత్ర కారుడు భారతీయ వ్యవస్థను ఫ్యూడల్ వ్యవస్థగా అభి వర్ణించాడు. 19వ శతాబ్దం రాజస్థాన్ రాష్ట్రం గురించి రాశాడు. టాడ్ అభిప్రాయాల్ని విమర్శిస్తూ రాశారు. ధర్మ శాస్త్రాలను టాడ్ చూడలేదు. ప్రాచీన భారతంలో ఫ్యూడలిజం గురించి మార్క్సిస్టు చరిత్ర కారుడు ఆర్. ఎస్. శర్మ రాశాడు. ఫ్యూడల్ వ్యవస్థలో భూమి ప్రాతిపదిక మీద పరిపాలనా నిర్మాణమంతా ఆధారపడి వుంటుంది అన్నాడు. దీని అర్థం సరిగా అవగాహన కావడం లేదు. భారతం, మనువు గ్రామపాలకులు వృత్తి ( జీతం) ని తీసుకుంటారని తెలుపుతున్నాయి. నూరు గ్రామాలు కలిపి ఒక గ్రామం, వెయ్యి గ్రామాలు కలిపి ఒక పురం. వీటికి ఒక పాలకుడుంటాడని మనువు. బ్రాహ్మణులకు భూములు దానం చేసేవారు. రాగి రేకుల మీద రికార్డు చేసేవారు. అనుశాసన పర్వంలో దాన ధర్మాలు వివరించబడ్డాయి. ఇటువంటి దానాలను మనువు, కౌటిల్యుడు వివరిస్తూ అటువంటి వాటిని అమ్ముకోడం గాని, తాకట్టు పెట్టే హక్కుగాని లేదన్నారు. యూరపులో లాగ భారతదేశంలో రాజకీయ వికేంద్రీకరణ ఫలితంగా భూముల్ని దానం చేయలేదు. పురోహితులకు, దేవాలయాలకు దానం చేశారు. ధృతరాష్ట్రుడు బ్రాహ్మణులకు అగ్రహారాలు దానం చేశాడని ధర్మరాజు నిర్ధారించాడు. ఇది ఫ్యూడలిజం అవుతుందా?

ఫ్యూడలిజాన్ని నిర్వచిస్తూ మార్క్ బ్లాచ్ ఇలా అన్నాడు :

ఫ్యూడలిజం అంటే **'the rgorous economic subjection of a host of humble bolk to a powerfulmen'** రోమన్ విల్లా, జర్మనీ, గ్రామాధికారులు ఈ పద్ధతుల్ని స్థిరపరచి ప్రజల్ని దోచుకున్నారు. భూమి శిస్తును వసూలుచేసే హక్కును పొందారు. మధ్య యుగంలో పురోహితులకు, బిక్షువులకు ఉపయోగపడటానికి, సైనికులకు ఉపయోగపడటానికి ఆవిధంగా వసూలు చేసేవారు.

పాలకునికి, సైనిక వృత్తి వర్గానికి మధ్య అవినాభావ సంబంధం తాదాత్మ్యత ఫ్యూడల్ వ్యవస్థలో కనిపిస్తుంది.

మార్క్సిస్టు దృక్పథంతో మారిస్ డోబ్ ఫ్యూడలిజం నిర్వచనం ఉత్పత్తిదారుని మీద బలవంతంగా స్వతంత్రంగా తన యిష్టానుసారం రాజుగారి ఆర్థిక అవసరాలు తీర్చే నిమిత్తం విధించే నిబద్ధత. ఆర్థిక అవసరాలు తీర్చడం సేవల ద్వారా గాని ధనరూపంలో చెల్లించడం గాని జరగాలి.

ఫ్యూడలిజాన్ని నిర్వచించడంలో బానిసత్వం కూడా చేర్చాడు శర్మ. ఇండియాలో బానిసత్వం వుందా? వుంటే ఎవరు విముక్తి కలిగించారు, ఎప్పుడు? అనే ప్రశ్నలుదయిస్తాయి. అర్థ బానిసలు, పూర్ణ బానిసలు అని భూమిని దున్నేవాడు పూర్తి బానిస, కౌలుదారుడు అర్ధ బానిస అన్నాడు. ప్రభుత్వానికి రైతుకు వున్న సంబంధం గుర్తించాడు. భారతీయ పద్ధతులకు యూరపు ఫ్యూడలిజానికి వున్న భేదాలను తెలిపాడు. అగ్రహారాలకు పాశ్చాత్యుల్లోని **manors** ( ప్రభువు ఉపయోగం కోసం మిరాసి భూములు) కు వున్న పోలికల్ని గుర్తించాడు శర్మ. రెండవ పృధ్వీరాజు సంతానం లేకుండా మరణించినప్పుడు మంత్రులు గుజరాత్ నుండి సోమేశ్వరుణ్ణి తీసుకొచ్చి పట్టంకట్టారు. మంత్రులు ఫ్యూడల్ రాజులు కారు, చాహమానా మంత్రుల్ని కూడా ఫ్యూడల్ రాజులుగా వర్ణించాడు. దశరధుడి మరణానంతరం రాజు లేకపోతే రాజ్యంలో అరాచకం ఏర్పడుతుందని రామాయణంలో మార్కండేయ ప్రభృతులు వశిష్టునితో చెప్పారు. అందుకని ఇక్ష్వాక రాజుగాని మరొకడుగాని రాజును నియమించాలని హితవు చెప్పారు. వశిష్టుడు అయోధ్యకు భరతుణ్ణి తీసుకువచ్చి దశరధుని శ్రాద్ధం అనంతరం రాజ్యాభిషేకం జరిగింది. రాజకర్తారులు కోరారు. సోమేశ్వరుని రాజ్యాభిషేకంగాని చాహమానమంత్రుల చర్యగాని ప్రాచీన భారతీయ సంప్రదాయమే. వాళ్లు ఫ్యూడల్ రాజులు కారు. చాళుక్య మహామాత్యుణ్ణి **'a kind of highly feaudalised ministerial functionary'** అని వర్ణించడంలో అర్థం లేదు. మూడవ ఎడ్వర్డు, ఎలిజబెత్ మధ్య కాలాన్ని వర్ణించడానికి సరియైన పదం దొరకలేదు పండితులకు. అందుకని ' భూస్వామ్యం నుండి పెట్టుబడిదారీ సమాజానికి మారుతున్న కాలం' అన్నారు.

భారతదేశ చరిత్రలో అటువంటి పరివర్తన కాలం కనిపించదు.

## ఆర్థిక జీవన పద్ధతి

పధ్నాల్గవ శతాబ్దం నుండి పదహారవ శతాబ్దాంతం వరకు పాశ్చాత్య దేశ ఆర్థిక సమాజం సంకీర్ణం. మారుతున్న కాలం. ప్రాచీన భారతీయ ఆర్థిక సమాజంకూడా భూస్వామ్యం కాదు పెట్టుబడిదారీ సమాజం కాదు. భారతదేశంలో రైతుకు శ్రామికునికి ఆర్థిక సంబంధం భూస్వామితోనే కాక రాజ్యంతోను, అప్పు యిచ్చేవాడితోను, వ్యాపారవేత్తతోను వుంటుంది. ఢక్కా ముస్లిమ్లు, మద్రాసు క్యాలికోలు ప్రభువులకేకాదు వాణిజ్యవేత్తలు కూడా వినియోగదారులే. ప్రాచీనకాలంలోనే వ్యాపారవేత్తలు అపార ధనాన్ని సంపాదించినట్టు ఆధారాలున్నాయి. తరవాత కాలంలో కొందరు ధనిక వ్యాపారులు

రాజ్యాన్ని చేజిక్కించుకున్నట్లు చరిత్ర సాక్ష్యం చెపుతోంది. ముస్లిముల పాలనలో వారి మతానుసారం వడ్డీ వ్యాపారం నిషేధం కనుక వైశ్యుల చేతుల్లోనే వడ్డీ వ్యాపారం వుండిపోయింది. ముస్లిం పాలన ముగిసే కాలానికి బెంగాల్లో జగత్ సేఠ్‌లు ఆర్థికంగా అధికారం చలాయించే స్థితికి చేరుకున్నారు. పాశ్చాత్య దేశంలో పాలకవర్గం నియంత్రించే శక్తి లేకపోవడం వల్ల సమాజ శ్రామికశక్తిని విపరీతంగా దోచుకోవడంతో ఫ్యూడలిజం క్షీణించింది. ఇండియాలో మనువు సేవ చేయడంవరకే అనుమతించడం వలన దోపిడీకి అవకాశంలేదు. మహాభారతంలో సేవ ఎక్కడాలేదు. శ్రామిక నిపుణుల్ని నగరానికి తెచ్చి వారికి సుఖ సంతోషాలు కలిగించే ప్రయత్నం కనిపిస్తుంది. రాజులు వ్యాపారుల్ని, గ్రామ కళాకారుల్ని నగరాలకు తెప్పించి అభివృద్ధికి దోహదపడ్డారు. వ్యాపారుల మీద పన్ను విధించడంలో మనువు మహా భారతం అంగీకరించాయి కాని శ్రామిక శిల్పుల ( శూద్రులు) మీద పన్ను విధించడాన్ని అంగీకరించకుండా వెట్టి చాకిరి ( సేవ) అనుమతించారు మనువు పద్ధతి కొనసాగింది. రాజులు శ్రామికులకు కావలసిన వస్తువులను యివ్వక పోవడం వల్ల వాళ్ళు వ్యాపారస్తుని మీదా, అప్పుయిచ్చేవాడి మీద ఆధారపడాల్సి వచ్చింది.

వేద కాలంలో శ్రామికుడు వ్యాపారస్తునికన్నా ముఖ్యుడు. ఇతిహాస కాలంలోనూ అదేస్థాయిలో వున్నాడు. తరవాత వ్యాపారస్తుడు ఆర్థికరంగాన్ని గుప్పిట్లో పెట్టుకుని శ్రామికుని స్థానాన్ని తగ్గించాడు. వేదకాల ప్రజలు గ్రామీణులు. మహాభారతం గ్రామ, ఘోష, పట్టణ, పుర, పల్లి, గోకుల వంటి పదాలు పేర్కొంది.

భాగవతం పురాణం (800 - 900) లో పుర, గ్రామ, ప్రజ (గోకుల) ఖేట ( చిన్నపట్నం లేదా గ్రామం), ఖర్వట ( కొండపల్లె) పట్టణ వంటి సంస్కృత పదాలు ప్రయోగించబడివున్నాయి. ఆకారాలు (గనులు) పేర్కొనడం వల్ల గనుల పట్నాలు వుండవచ్చు. ఒంటె ప్రయాణాలు కూడా భారతంలో వర్ణించబడ్డాయి. ఒకచోట నుంచి మరోచోటికి అడవుల్లోను ప్రయాణించేవి. నగరాలు అభివృద్ధి చెందాయి. వస్తువుల చలామణి పెట్టుబడికి ఆరంభ సూచకం అన్నాడు మార్క్స్. ఒంటెల మీద వ్యాపారం ఇదే సూచిస్తుంది. వస్తూత్పత్తి, అభివృద్ధి చెందిన వస్తు చలామణి వ్యాపారం చారిత్రక పూర్వదశలనుండి పెట్టుబడి రూపం ఉద్భవిస్తుంది. కుల శ్రేణుల ఆధారంగా ఉత్పత్తి విధానం ప్రాచీన భారతంలో వున్నట్లు తెలుస్తూ వుంది. శ్రేణి ధర్మాన్ని రాజు రక్షించేవాడు. శిల్పశ్రేణులు, వర్తక శ్రేణులు తరవాత కాలంలో బలంగా శక్తివంతంగా వుండటమేకాదు కుబేరులైన వర్తకులు, ఒంటెల నాయకులు ఉన్నతమైన హోదాను అనుభవించినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. ఇతిహాసాల్లో వర్తక పెట్టుబడి పోగుబడినట్లు పెద్దగా కనిపించదు. జాతక కథల్లోను, కథా సరిత్సాగంలోను కనిపిస్తుంది.

ఇతిహాసాలు క్షత్రియ రాజుల కథలనే వర్ణించాయి. వర్తకుల పట్ల శ్రద్ధ చూపలేదు. తరవాత వెలువడిన సాహిత్యంలో వర్తకుల గాథలున్నాయి. వర్తక పెట్టుబడి ప్రారంభదశ ఇతిహాసయుగం. క్రీ.పూ. ఆరు, అయిదు శతాబ్దాలు అంటే బుద్ధుని కాలానికి అభివృద్ధి చెందింది. ఉత్పత్తి మారకపు విలువలతో

వర్తకం, వర్తకుని పెట్టుబడి ఇతోధికంగా పెరిగిపోయింది. మధ్య యుగ పాశ్చాత్య దేశాల్లో ఆర్థికాన్ని శాసించింది ఉత్పత్తిదారుడు కాదు వ్యాపారస్తుడు. ప్రాచీన భారతంలోనూ అంతే. పాశ్చాత్యంలో వ్యాపారస్తుడు క్రమంగా ఉత్పత్తిలోకి అడుగుపెట్టాడు, పరిశ్రమ వ్యాపారానికి సేవకుడూగా మారేవరకు. అలాగే కొంతమంది ఉత్పత్తిదారులు వ్యాపారరంగంలోకి ప్రవేశించడం జరిగింది.

భారతదేశంలో మాత్రం ఈ విధంగా జరగక పోడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది కులవ్యవస్థ, వైశ్యవృత్తి (వ్యాపారం), శూద్రవృత్తి (వస్తువులు తయారు చేసేవారు) కన్నా గొప్పది. శ్రామికులు స్థానిక ప్రజలకు సేవ చేయడమే, అధికోత్పత్తి చేసి వర్తకుణ్ణి మెప్పించి తృప్తి పడేవారు. రెండో కారణం ఆర్థిక జీవనంలో ప్రాచీన భారతానికి, మధ్యయుగ యూరపుకు భేదం వుంది. అప్పుతీసుకున్నవాడు చెల్లించే వడ్డీలో కొన్ని నియమాలున్నాయి. ఋగ్వేదం, మనువు, యాజ్ఞవల్క్యుడు రెండు, మూడు, నాలుగు, అయిదు శాతం నెలకు వడ్డీ చెల్లించాలని చెపుతూ వర్ణాన్ని బట్టి నిర్ణయించారు. బ్రాహ్మణులు చెల్లించాల్సింది 24 శాతం, క్షత్రియులు 36 శాతం, వైశ్యులు 48 శాతం, శూద్రులు 60 శాతం వడ్డీ సంవత్సరానికి చెల్లించాలి. అసలుకు మించకూడదు వడ్డీ.

ధర్మశాస్త్రాలు, కౌటిల్యుడు తనఖా, కంట్రాక్టులు గురించి చాలా విషయాలు రూపొందించారు. మనువు, కౌటిల్యుడు పుట్టిన రెండువేల సంవత్సరాల తర్వాత 1571లో ఇంగ్లాండులో వడ్డీ వ్యాపారాన్ని అనుమతించారు. వడ్డీ పదిశాతానికి మించ కూడదన్నారు.

ప్రాచీన భారత ఆర్థికస్థితి వడ్డీ వ్యాపారస్తుని పెట్టుబడిని బాగా పెంచేదిగానే వుందనడంలో సందేహం లేదు. మార్క్స్ భారతీయ సమాజ ఆర్థిక స్థితిని పరిశీలించాడు. చిన్న రైతులు, వృత్తి నైపుణ్యం గల శ్రామికులు రుణాలు తీసుకుని వడ్డీ వ్యాపారస్తుని పెట్టుబడిని పెంచారు. వాళ్ళు పతనమయ్యారు. వడ్డీ వ్యాపారం చాలాకాలం కొనసాగింది. ఉత్పత్తి చేసిందేమీలేదు సరిగదా ఆర్థిక క్షీణతకూ, రాజకీయ అవినీతికి దోహదపడిందన్నాడు మార్క్స్. (కాపిటల్ వల్యూము. 3 - పే. 597, 1974)

ఆసియన్ ఫారమ్స్ ఆఫ్ యుజరీ అన్నాడు. మార్క్స్ దృష్టిలో బారతదేశం కావచ్చు. వ్యాపారం పరిశ్రమ సమానంగా అభివృద్ధి చెందినా జాతకకథల్లోని అనాధ పిండకుని వంటి ధనికుడు ఇతిహాసాల్లో కనబడలేదు. అపారమైన పెట్టుబడి తరవాత కాలంలో జరిగింది. యుద్ధ సమయంలో నైపుణ్యంగల శ్రామికులు కావాలి. కమ్మరి ఆయుధాలు చేయడానికి కావాలి. కంసాలి ఆభరణాలు, రథకారులు, నేత పనివారు వీరంతా యుద్ధానికి ముందు ఉచ్చ స్థితిలో వున్న వారే. యుద్ధానంతరం రాజులంతా మరణించారు. సైన్యం నశించింది. ఆ పరిస్థితుల్లో పనిలేని శ్రామికుడు అప్పులు యిచ్చేవాడి వద్దకు వెళ్లవలసివచ్చింది. వాడే వ్యాపారి, ఈవిధంగా వర్తకుని, వడ్డీ వ్యాపారస్తుని పెట్టుబడి పెరిగింది.

## ధనం – ఋణం

ఇతిహాస యుగంలో ధనాన్ని ఉపయోగించారు. సరియైన సాక్ష్యం లేదు. గుప్తులు ఇండో గ్రీకు, ఇండో సిథియన్ రాజులు నాణేలను చలామణిలోకి తెచ్చారు. వాకాటకులు, ఇక్ష్వాకులు, కాదంబులు,

గాంగులు, పల్లవులు, రాష్ట్రకూటులు, పాల, సేన, చాళుక్యరాజులు నాణేలను తయారు చేయలేదు. ఆర్థిక సూత్రాలు ఎప్పుడూ స్థిరంగా వుండవు. వ్యవస్థను బట్టి మారుతూ వుంటాయి. ఋణ విధానం మనువు కాలంలోనే అభివృద్ధి చెందింది. కృతాకృతం చకనకం పదానికి ఘటితాఘటితం కనకం అనివ్యాఖ్యానం. ఆంగ్లంలో **Coined or uncoined gold.** ఇతిహాస యుగంలో బంగారం వినిమయంలో వుంది. లభించిన ఆధారాలను బట్టి వర్తకం ప్రాచీన భారతంలో నాణేల చలామణి మీద ఆధారపడలేదు. వెండి రాగి నాణేలు తయారు చేసేవారు కాని బంగారు నాణేలు గురించి కౌటిల్యుడు చెప్పలేదు.

14, 15 శతాబ్దాలలో నాణేలు ముద్రించారు. ప్రలోభంవల్ల జనం ధనం కూడబెట్టుకోడం ప్రారంభించారు. సర్వేజనా ః కాంచనమాశ్రయంతి అని సామెత. ఏథెన్సు నగరంలో శ్రీమంతుడు టైమన్. అతిథి సత్కారాలు చేస్తూ వున్నదంతా పోగొట్టుకుని నిస్సహాయుడవుతాడు. ఒక గుహలో దాక్కొని ఉంటాడు. ఒక రోజు నేలను తవ్వుతాడు. బంగారం కనబడుతుంది. అప్పుడు టైమను కాంచన విలాసం మీద చేసిన స్వగతం అర్థ శాస్త్రంలో శాశ్వత స్థానం ఆక్రమించింది. షేక్స్పియరు రచన కావడం మార్క్సుకు మరింత అభిమానం గనుక తన రచనలో ఉదహరించుకున్నాడు. (టైమన్ ఆఫ్ ఏథెన్స్ 4-3).

బంగారం మానవాళికి సమిష్టి వేశ్య (**common whore of man kind**) అనడం గమనించవలసిన విషయం. (మార్క్స్, ఎంగెల్సు **on art and literature p.** 135) అర్థం ఏవ ప్రధాన ఇతి కౌటిల్యాః అర్థమూతాహి ధర్మ కామావితి.

భారతదేశంలో కులవ్యవస్థ వల్ల పాశ్చాత్య సమాజంలో వచ్చిన మార్పులు రాలేదు. ఫ్యూడలిజం వుందని, దాన్ని భారతీయ సమాజానికి ఆపాదించడానికి బలవంతంగా రుద్దడానికి ప్రయత్నించడం జరిగింది. ధర్మశాస్త్రాల అధిపత్యం వల్ల ఫ్యూడలిజానికి అవకాశం లేదు. దోపిడీ వర్గాలైనా ఏకం అయినాయేమోగాని దోపిడీకి గురైన వర్గాలు కలవడానికి అవకాశమే లేదు. అసంఖ్యాక కులాలుగా విడిపోవడమే కారణం. ప్రాచీన భారతంలో ఫ్యూడలిజం వుందని చెప్పడానికి శర్మ ప్రయత్నించాడు. ఇర్ఫాన్ హబీబ్ చెప్పలేదు. బ్రిటీషు పాలనకు ముందు ప్రాచీన కాలంనుంచి భూమి ఆస్తిని గురించి రాశాడు. ఆర్ఎస్ శర్మ రాసిన ఇండియన్ ఫ్యూడలిజం (300 - 1200) 1965లో వచ్చింది. హబీబ్ తన వ్యాసం రాసే నాటికి శర్మ గ్రంథం చూడలేదన్నాడు. యూరపు సమాజంలో మధ్య యుగంలో వున్న ఫ్యూడలిజం ప్రాచీన భారతంలో వుందనడం సమంజసంగా లేదు. భారతీయ సంస్కృతి, సమాజాన్ని, చరిత్రను పరిశీలించే మేధావులు కూడా అపార్థం చేసుకుని వ్యాఖ్యానించడం జరుగుతూ వుంది.

# గియోర్గి లుకాచ్ - సౌందర్య శాస్త్రం

- డా॥ తక్కోలు మాచిరెడ్డి

గియోర్గి లుకాచ్ ప్రపంచ ప్రసిద్ధి చెందిన హంగేరియన్ సౌందర్య శాస్త్ర వేత్త. అతడు హంగేరియన్ భాషలో రాసిన 'సౌందర్య శాస్త్రం' ఇంకా మన భాషల్లోకి అనువదించ లేదు. ఆంగ్ల అనువాదం కూడా ఇంకా రాలేదు. నేను ఆ 'సౌందర్యశాస్త్రం' యొక్క భూమిక ఆంగ్లానువాదం మాత్రం చదవగలిగాను. లుకాచ్ గురించిన కొన్ని ఇతర పుస్తకాలు చదవడం జరిగింది. ఆయన అభిప్రాయాలు మీతో పంచుకుందామని ఈ నాలుగు వాక్యాలూ రాస్తున్నాను.

1930 లో లుకాచ్ కళాసమస్యల్ని గురించి ఆలోచించాడు. స్టాలిన్ కాలంలో లుకాచ్ మాస్కోలో వున్నా, స్టాలిన్ వాదాన్నీ ముఖ్యంగా ఝ్దానొవ్ సూత్రీకరణల్నీ పిడివాదాన్నీ వ్యతిరేకించాడు. మార్క్స్ వాదాన్ని సౌందర్య శాస్త్రానికి ఎలా అన్వయించాలి అనే అంశంపై లోతుగా ఆలోచించినాడు. సంప్రదాయాన్ని అర్థం చేసుకొని, దాన్ని అధిగమించాలి అని భావించినాడు. మార్క్స్‌వాదం సమస్త సంప్రదాయానికీ వ్యతిరేకం కాదని నమ్మినాడు. సమస్యను ద్వంద్వాత్మకంగా పరిశీలించినాడు. ఆలోచనల నిరంతరతనూ, నవ్యతనూ ఆహ్వానించినాడు.

కళాకృతి పట్లా, ప్రకృతి పట్లా మన వైఖరి ఎలా వుండాలో స్పష్టంగా విశదీకరించినాడు లుకాచ్. ప్రకృతి కంటె, చిత్రీకరించిన ప్రకృతి ఎక్కువ అందంగా వుంటుంది అనే వాదనలో పస లేదని అన్నాడు. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించలేని వ్యక్తి కళా సౌందర్యాన్ని ఎలా ఆస్వాదించ గలడు అని ప్రశ్నిస్తాడు లుకాచ్. సుందర వస్తువుల్నీ, అందమైన ప్రకృతినీ ఆస్వాదించే కళను మనకు మానవ పరిణామ చరిత్ర ఇచ్చింది.

కళా ప్రయోజనాన్ని గురించి రాస్తూ లుకాచ్ కళ మనల్ని జాతి మతాలకు అతీతంగా వుంచుతుంది, దేశ కాలాలను అధిగమించేట్లు చేస్తుంది; జీవితంలో గొప్ప క్షణాల్ని ఇస్తుంది; కాబట్టి ఇది ఒక జీవిత విలువ అయింది. అడవులూ, పర్వతాలూ, మనుషులూ జీవిత విలువలు కలిగి వున్నట్లే కళ కూడా జీవిత విలువల్ని సంతరించుకుంది. కళ సంతరించి పెట్టే జీవిత విలువ అతి సంశ్లిష్టమైనది, లోతైనది, విశిష్టమైనదీను. కళను నిర్వచిస్తూ - రూపం సాయంతో ధ్వనియే కళ అవుతుందన్నాడు లుకాచ్. సరళంగానే వుండాలి కళ అని అతడు అనలేదు. కళకు ఏదో ఒక ప్రత్యేకత వుండాలి అంటాడు. సమగ్రత వుండాలంటాడు. సంప్రదాయానికి పెద్ద పీట వేస్తూ అరిస్టోటిల్ నుండి హెగెల్ వరకూ వచ్చిన సంప్రదాయాల్ని మార్క్స్ ఖండించ లేదంటాడు లుకాచ్. కార్ల్ మార్క్స్ షేక్స్‌పియర్ నాటకాల్నీ, కవితల్నీ బాగా మెచ్చుకొనేవాడు. ముఖ్యంగ డబ్బును ఒక వక్రీకరణ శక్తిగా వర్ణించే షేక్స్‌పియర్ కవితను మార్క్స్ తరచుగా ఉటంకించే వాడు, అని అంటాడు లుకాచ్.

లుకాచ్ ప్రకారం శ్రేష్ఠమైన కళ మానవ జీవిత సంపూర్ణత్వాన్ని సమగ్రంగా ప్రతిఫలించాలి. ఆయన

ప్రతి పాదించిన సౌందర్య శాస్త్రంలో రెండు ప్రధానాంశాలున్నాయి. అవేమిటంటే ఒకటి ప్రతిబింబీకరణ, రెండు ప్రాతినిధ్యీకరణ. ఆయన చెప్పే ప్రతిబింబీ కరణ ఛాయా చిత్రం లాంటి ప్రతిబింబీకరణ కాదు. లేక భావవాద స్వీయాత్మక స్వప్నమూ కాదు. అది మానవ వాస్తవికతను వ్యక్తీకరించేది. 'యూరపు వాస్తవికతావాద అధ్యయనం' అనే గ్రంథంలో లుకాచ్ వాస్తవికతా వాదం గురించి రాస్తూ వాస్తవికతా వాదమే సంపూర్ణ మానవ వ్యక్తిత్వాన్ని సమాజం సాపేక్షంగా ప్రతిబింబించగలదు అని అన్నాడు.

కళ ప్రయోజనం కేవలం భావ వ్యక్తీకరణ మాత్రమే కాదు. అది మనల్ని ఉదాత్తమైన పద్ధతిలో, ఉదాత్తమైన మార్గంలో ఉత్తేజితుల్ని చేస్తుంది. అంతే కానీ, కళ అంటే కేవలం కళాకారుడు వ్యక్తం చేసే భావాల్ని గ్రహించడం, లేక ఆస్వాదించడం మాత్రమే కాదు. కళాకారునికి ప్రపంచ దృక్పథం అవసరం. జర్మన్‌లో దీన్నే 'వెల్టన్ షావుంగ్' అంటారు **(weltan schauing)**. వెల్టన్ షావుంగ్ అంటే కేవలం ప్రపంచ దృక్పథం కాదు, అది జీవిత దృక్పథం. సంవేదనతో, స్వచేతనతో, స్వానుభవంతో కూడుకున్న జీవిత దృక్పథం, ప్రపంచ దృక్పథం.

సాహిత్యంలో, కళలో రూపం యొక్క స్థానం గురించి లుకాచ్‌కు నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. 'సాహిత్యంలో నిజమైన సామాజిక అంశం రూపమే' అంటాడు లుకాచ్. రూపం భావజాలానికి సంబంధించిన అంశమే, డా॥ సూర్యసాగర్ 'సాహిత్యం - సౌందర్యం' అనే తన పుస్తకంలో అన్నట్లు రూపం కూడా సామాజిక సారాన్ని ప్రతిబింబిస్తుంది. పద్యాలు రాచరికయుగానికి చెందినవే, ఆధునిక యుగానికి చెందిన రూపం కాదు ఇది. విషయ నవ్యత, నూతన రూపాన్ని కోరుతుంది. శ్రీశ్రీ మహాప్రస్థానంలో ఈనవ్యత వుందంటూ చలం అంటాడు. 'ఇంకా రాత్రి చీకట్లో, లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంటో, దీనంగా పలవరించే సమయాన, ఉషా గమనాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు శ్రీశ్రీ. హృదయం ఎలా కంపిస్తే అలా ఆ కంపనకి మాటల రూపాన్ని యివ్వడం అతనికే తెలుసు. మాటల్ని కత్తులూ, యీటెలూ, మంటలుగా మార్చడం అతనికే చేతనవును', రూపం పై సంపూర్ణ అధికారంతో రాశాడు శ్రీశ్రీ. నవ్య విషయం, నవ్యరూపం, ప్రళయంకర విషయం మహా ప్రళయంకర రూపం శ్రీశ్రీ సొంతం. అదే విప్లవం, మరి రూపం సామాజికి అంశమే లుకాచ్ అన్నట్లు.

నిబద్ధతను గురించి రాస్తూ లుకాచ్ - నిబద్ధతనూ, నిమగ్నతనూ వ్యతిరేకం చేసి చూడకుండా, అవి సాహితీకృతిలో స్వతహాగా సహజంగా వుద్భవించాలి, అంతేకానీ వాటిని పైనుంచీ చొప్పించకూడదు అంటాడు. సాహిత్యాన్ని గురించి లెనిన్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు పార్టీ సాహిత్యాన్ని గురించే కానీ, సృజనాత్మక సాహిత్యం గురించి కాదని క్రూప్స్క్రియా అన్నట్లు లుకాచ్ రాశాడు. ఈ విశదీకరణ అపోహల్ని తొలగిస్తుందని ఆశిద్దాం.

# 'నూతి'లో గొంతుకల 20వ శతాబ్దపు తెలుగు కవిత్వం !

(గత సంచిక తరువాయి) -నరేష్ నున్నా

ఈ వాదనను పూర్తిగా పూర్వపక్షం చేసింది తెలుగు ఆధునిక సాహిత్యలోకం. నిజానికి సమాచారం, జ్ఞానం కొన్ని అల్పసంఖ్యాక వర్గాలకే పరిమితం కావడాన్ని ఆధునికత నిరసించింది. తెలుసుకోలేనిది ఉండవచ్చునేమోగానీ, తెలుసుకోరానిది ఉండటానికి వీల్లేదంటూ నిషేధాల సంకెళ్ళని తెంచివేసింది. అందనిది, దక్కనిది ఉంటే 'పోరాటం' లేబుల్ కింద యాగీ చేయడానికి అవకాశముంటుంది గానీ, అదే అందుబాటులోకి వస్తే ఇక ఆటకు ఆస్కారమేముంటుంది? అందుకే తిరస్కారానికి వీలున్న మార్గాల అన్వేషణలో పడ్డారిక్కడ సాహిత్య జీవులు. 'తారీఖులు దస్తావేజులు ఇది కాదోయ్ చరిత్ర కర్థం' అనీ, 'ఏ జాతి చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణ' మంటూ ఈసడించిన శ్రీశ్రీ యే నెపంగా చరిత్రను తిరస్కరించింది. నిఘంటువులు, వ్యాకరణాలు - సంకెళ్ళని ప్రభోదించిన శ్రీశ్రీ సాక్షిగా **cultural anthropological** చదువుల్ని రద్దు చేసుకుంది. 'నేతి', 'నేతి' అనడంలో సౌఖ్యాన్ని గుర్తించాయి శ్రీశ్రీ తర్వాత తరాలు. అభ్యుదయకాముకులు, ప్రగతి శీలుల పఠనాసక్తి 'మాస్కో - రాదుగ ప్రచురణ' లకు పరిమితమైతే, ఆ తర్వాత తరం ఆపాటి శ్రమను కూడా తీసుకోలేకపోయింది. '80ల తర్వాత తెలుగు కవిత్వపు చాపకింద కొత్త నీరులా ప్రవేశించిన యాంటీ మార్క్సిస్టు భావజాలం ఓపలేని సౌఖ్యాన్ని అలవరించింది. '80ల తర్వాత తరాలు బహుసులువైన 'జీవితాన్ని జీవిస్తూ, కవిత్వీకరించడం' మనే పనిని సునాయాసంగా నేర్చుకొని, గొప్ప పరిణితి సాధించాయి.

పరాయికరణకు లోనవడం, భాష చాలనితనాన్ని అనుభవించడం, బాల్యానికై దిగులు పడటం, మట్టి వాసనకై మొహంవాచడం, పల్లెజ్ఞాపకాలతో విరహపడటం, సకల జీవన సంక్లిష్టతలను దర్శించడం ... వగైరాల వంటి కవితా వస్తువులతో ఈ తరం కవి మోసానికి పాల్పడ్డాడని కాదు నా భావం. లేని భావాలను కల్పించుకొని కవిత్వం రాశాడని కూడా నేను ఆరోపించడం లేదు. కానీ, 'మో', అజంతా సృష్టించిన కవిత్వాల వల్ల ఏర్పడిన ఆకర్షణీయమైన వాతావరణం కవిని హిప్నోటిక్ మత్తులోకి దించింది. పదే పదే తాము వల్లించిన ఆధునిక జీవన సంక్లిష్టతా మంత్రమూలాలను తెలుసుకోవడానికైనా ఏ ప్రసార మాధ్యమాలనూ పట్టించుకోని కవిలోకం, ఈ కొత్త హిప్నోటిక్ మాయలో దిన / వార పత్రికల మీద ఆవురావురమని దూకి, కవితా వస్తువుల వేటలో మునిగిపోయారు. తాము కవిత్వాలు, కవితా సంకలనాలు వేలార్చడానికైనా తెంపులేని సమస్యలతో ధరణి వర్థిల్లాలని కోరుకున్నారంటే అతిశయోక్తి కాదనుకుంటా.

ఇటువంటి తరానికి అజంతా, మో ఆదర్శం కావడానికి కారణాలున్నాయి. ఆ కారణాలు అర్థం చేసుకునే ముందు వారి కవిత్వాలకు సంబంధించిన అపోహలను తుడిచివేయవలసి ఉంది. ఇద్దరి కవిత్వాలలో వస్తువు విషాదం, మృత్యువు కనుక ఇద్దరికీ మూలం ఒకే కుదురని భావించింది సాహిత్యలోకం. కానీ 'మో' లా అజంతా విషాద విశ్వరూపాన్ని ప్రదర్శించిన వాడు కాదు. హాప్కిన్స్ మాటల్లో చెప్పాలంటే, సముద్రం కొట్టే చెంప దెబ్బల్ని సహించే 'నెగటివ్ కేపబిలిటీ' ని అందిస్తుంది మో తరహా కవిత్వం.

కానీ, అజంతా కవిత్వం అటువంటిది కాదు. అజంతా కవిత్వంలో 'నేను' ప్రతిక్షేపణలకు వీలున్న 'నేను'. అంటే 'నొప్పి' తెలిసిన ఏ నగర వ్యధితుడికైనా అజంతా విషాదం ఒక **metaphorical**

representation. కానీ, 'మో'లో'నేను' ఒక conceit. దానికి ప్రతిక్షేపక అస్తిత్వం మరొకటి లేదు. తనకు ఒనగూడే తక్షణ ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే సిద్ధాంతాలు, పథకాలు, ప్రభుత్వాల ఉనికిని సామాన్యుడు ఎలా గ్రహిస్తాడో, అజంతా కూడా అదేవిధంగా తన కవితా సృజనకు అవసరమైన మేరకు మాత్రమే భిన్న ప్రపంచాలను గుర్తిస్తారు. తన కవితాక్షరాల sourceను ఇబ్బంది పెట్టే భావాలను వేటినీ ఆయన ఆహ్వానించరు. కవిని 'డిస్ట్రాయర్' అని కూడా సంబోధించిన అజంతాలో ఆంతరంగికంగా ఆ destractive తత్వం లేదు. అందువల్లనే 'కవిత్వం' అదీనూ 'తమ కవిత్వం' గురించే తప్ప వేరేమీ తెలియని '80ల తర్వాత కవులకు అజంతా ఆదర్శమయ్యాడు. అంటే, విశేషాధ్యయనం, రాక్షస జీర్ణశక్తి, అవగాహన, పరిశీలన, ప్రతిభ ఉన్న 'మో'లో ఉన్న శైలీగతమైన నైపుణ్యాన్ని మాత్రమే అనుకరిస్తూ, అజంతా మార్గంలో నడిచింది '80ల తర్వాత కవుల తరం.

బ్రతుకులోని ప్రతి క్షణాన్ని, కణాన్ని వసంతోత్సవాలతో నింపాలన్న తత్వాన్నే జీవితంగా, కవిత్వంగా చేసుకున్న ఇస్మాయిల్ తన పరిణామ క్రమంలో భాగంగా జపాన్ జెన్ బౌద్ధుల 'హైకూ'ను ఆంధ్రీకరించారు. "The flame of life lies in the heart of each passing second' అన్న జెన్ బౌద్ధపు చైతన్య దీప్తిని ఇముడ్చుకున్న హైకూను తెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశారాయన. 5,7,5 సిలబల్స్ అనే నియమాన్ని పాటించడం తెలుగులో సులభం కాకపోవడం వల్ల, రూపం కంటే, వస్తువే హైకూకు ప్రధానం కావడం వల్ల, దాని స్ఫూర్తిని మాత్రమే ఇస్మాయిల్ ఆదర్శంగా తీసుకున్నారు. అయితే, ఈ హైకూ కూడా తెలుగు కవుల 'నైపుణ్యాల వల'కు చిక్కి గిజగిజ లాడింది. 1920 ప్రాంతాలలోనే తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి 'హైకూ' తాత్వికతను వివరిస్తూ వ్యాసాలు రాశారు. అయితే, హైకూ ఒక మినీ కవితలా, 'విశేష ప్రజాదరణ'కు గురై భ్రష్టుపట్టిపోయింది ఎక్కువ తమిళనాడులోనే. సైన్స్‌లో మాదిరిగా సాహిత్యంలో ప్రగతి కాలానుగుణంగా linear గా ఉండదని తెలిసిందే. కానీ, ముందు తరం సాహిత్యకారులు పరిచిన దారులలో నడుస్తూ, ఆ దారులను మరింత విస్తృతం చేయవలసిన బాధ్యత మాత్రం తర్వాత తరం రచయితలకు ఉంటుంది. అటువంటి బాధ్యతను విస్మరించడంలో భారతదేశానిది అగ్రస్థానమైతే, దానిలో ఆంధ్రప్రదేశ్ మరింత ముందుంటుంది. చూడగానే తళుక్కుమనేలా మెరిసే మూడు వాక్యశకలాలను పేర్చడమనే సులువైన విన్యాసంగా 'హైకూ'ను ఆంధ్రదేశం అర్థం చేసుకుంది. ఈ పాపానికి కొంత మేరకు ఇస్మాయిలే బాధ్యులు.

కనుక ప్రతిభావంతులైన ఈ అనిబద్ధ కవుల కవిత్వాలు వారి self enlightenmentకు తప్ప మరెందుకూ ఉపయోగ పడలే దన్నది సుస్పష్టం.

★ ★ ★

'80 తర్వాత వచ్చిన ఉద్యమాలలో స్త్రీవాద, దళిత, మైనారిటీ వాద కవిత్వోద్యమాలు ప్రధానమైనవి. ఆంధ్రప్రదేశ్‌లో ఇవి ఒక విధంగా వామపక్ష భావజాలాల కొనసాగింపు లానే తయారయ్యాయి. స్త్రీవాదుల విషయానికొస్తే, మొదట్లో కొత్త ప్రశ్నలు రేపి, కొత్త స్పృహను కలిగించినప్పటికీ, క్రమేణా వారి గొంతులు బలహీనమై వారిది కూడా ఆరంభ శూరత్వ మనిపించుకున్నారు. బహుశా తెలుగుకవుల నైపుణ్యాలక్షణం వల్ల కాబోలు తొలినాళ్లలో కొన్ని మంచి కవితల్నే రాశారు.

దైనందిన వార్తలు కవితా వస్తువులై కొంత ఆదుకున్నా, తర్వాత తర్వాత అవి కూడా కరువయ్యాయి. నిజానికి సంభవిస్తున్న పరిణామాలకు అనుగుణంగా ప్రవాహదిశను మార్చుకోవడం ఒక సృజనాత్మక బాధ్యత. ఇది కొరవడటానికి ముఖ్య కారణం స్త్రీవాద ఉద్యమం, వామపక్ష ఉద్యమాల పాయవంటిది కావడమే. ఫెమినిస్టు చైతన్యం ఉన్న ఎక్కువ మంది స్త్రీలు కమ్యూనిస్టు 'మతా' నికి చెందినవారు కావడం, అంటే అధ్యయన లేమి ఒక ముఖ్య అలంకారం కావడం వల్ల ఎక్కువ మందిలో కార్యకర్తృత్వ ఉద్రేకమే తప్ప, సృజనాత్మక చైతన్యం లేదు. 'నిశ్చితాభిప్రాయాలు' కలిగి ఉండటం; 'సమస్య' తెలియకున్నా 'పరిష్కారం' ముందుగానే అర్థమవడం, 'నిజం' అన్వేషణ కంటే 'నిజనిర్ధారణ'కే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వంటి లక్షణాలు వారికి వారసత్వంగా అబ్బినవే. అణిగి ఉన్న (అణచబడ్డ) తమ భావోద్వేగాలకు వాహిక దొరికిందన్న ఆనందం కన్నా, అత్యుత్సాహ ప్రదర్శనకు ఒక వేదిక దొరికిందనే సంబరంతోనే స్త్రీవాదులు ప్రారంభంలో గొంతెత్తారు. జీవితంలో తలపడే అనుభవాలు ఉండే వీలు లేదు కనుక, వస్తువుల (సమస్యల) చిట్టా అయిపోగానే వారి గొంతులు మూగబోయాయి.

ఇక దళిత వాదానికి మూలం అన్నింటికీ భిన్నమైనది. ఇతర ఇజాలకూ, వాదాలకూ, కవిత్వాలకీ పశ్చిమ దేశాలే ఎంతో కొంత **contribute** చేశాయే గానీ, మనకే సంబంధించిన ఈ ప్రత్యేక, అతిముఖ్యమైన సమస్యలకు మన జీవితానుభవాలే భూమిక కావాల్సిన పరిస్థితిని దళితవాదం తీసుకొచ్చింది. భారత దేశంలోని ఇతర ప్రాంతాలతో పోల్చినప్పుడు సాపేక్షంగా ఇక్కడ కులాధిపత్యం తక్కువే. ఇంకా కచ్చితంగా చెప్పుకోవాలంటే, అంతరం **(heirarchy)** ఉందీ, ఆధిపత్యం **(hegimony)** కూడా ఉంది. కానీ, ఆ ఆధిపత్యాన్ని ప్రశ్నించే స్వభావం లేకపోవడం, దాని 'పవిత్ర'తని గుర్తించడం వల్ల ఎక్కువ పేచీలు లేకుండా పోయాయి. ఇంతకుముందు చెప్పుకున్నట్లు తెలుగువాడి కాస్మోపాలిటన్ తత్వం వల్ల, అన్నింటి మీదలానే 'కులాభి జాత్యం'తో కూడా అతనికి **detachment** ఉంటూనే వచ్చింది. ఆ కారణం చేతనే (జీవితానుభవాలు తక్కువవడం వల్ల కూడా) తెలుగుదేశంలో దళిత స్పృహ చాలా ఆలస్యంగా కలిగింది. తీవ్రమైన బ్రాహ్మణాధిపత్యం, అంబేడ్కర్ బోధనలు, తిరుగుబాటు, నిత్యజీవితంలో ఎదురయ్యే అవమానాలు, దానికి ప్రతిగా తలెత్తే ఆత్మగౌరవాలు... ఇవన్నీ నేపథ్యం కావడం వల్ల మరాఠీ నేలమీద దళితవాదం మిగతా అన్ని చోట్లకంటే ఎక్కువగా వికసించింది. ఇదొక రకమైన సాంస్కృతిక వికాసం. అగ్రకులాధిపత్యం బాగా ఉన్న తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాలలో దళితరాజకీయ వికాసం జరిగింది. గానీ, సాంస్కృతిక వికాసం తక్కువే. భారతదేశమంటే కులమేనని దాదాపు శతాబ్దకాలంగా చెబుతున్న త్రిపురనేని రామస్వామి, పెరియార్, అంబేద్కర్ వంటి వారిని, అర్థశతాబ్దంగా వివరిస్తున్న, లోహియా వంటి వారిని తెలుగు సీమ కన్నెత్తి కూడా చూడక పోవడాన్ని 'తెలివిమీరిన తనా'న్ని 'స్వాభావికత' జయించడంగా గుర్తించవచ్చు. విచిత్రమేమంటే, 1985 లో కారంచేడు దళితమేధం రాజకీయంగా కొంత కదలిక తెస్తే, 1991-92 వరకు కూడా కవిలోకంలో స్పందన రాకపోవడం కంటే తెలుగు కవి లోకం 'స్వాభావికత'ను వివరించడానికి వేరే ఉదాహరణ ఉండదు. అయితే, మరాఠీ దళిత సాహిత్య సీమలో మొదట 'వచనం' రాజ్యమేలింది. ప్రత్యామ్నాయశక్తుల్నీ క్రోడీకరించే పరిణామక్రమంలో వారికి మూడవ దశలో ఆలంబనగా నిలిచిన కవిత్వం - తెలుగు నేలమీద తొలిదశలోనే విజృంభించడంలో పెద్ద ఆశ్చర్యపోయే దేమీలేదు. కానీ, 35 ఏళ్ళుగా మరాఠీ నేల మీద, 25 ఏళ్ళుగా గుజరాతి నేలమీద

సంభవించిన ప్రధానమైన మార్పులన్నీ ఆ రేడు ఏళ్ళలోనే తెలుగునేల మీద సంభవించి, 'తెలివిమీరిన' తనానికే కొత్త అర్థాన్ని ఇచ్చాయి. శాఖోపశాఖలై విస్తరించిన దళితవాదం, మరుసటి Phase లో అమాంతం కుప్ప కూలిపోవడం సహజంగానే ఒక అనివార్య పరిణామం. అలా సహజమరణానికి అది చేరువ కాకుండానే అంతకంటే ముందే దళిత కవిత్వం రాలిపోయింది. రిజర్వేషన్ వర్గీకరణ డిమాండ్ వల్ల దళితుల్లో మాల, మాదిగ చీలిక ఏర్పడటంతో దళితవాదంలో సత్వర శిశిరం ప్రవేశించింది. నిజానికి 'కులజులుగా చీలి ఉన్న వారిని మనుజులుగా ఏకం చేయడమే దళితవాద స్ఫూర్తి' అని అర్థమయి ఉంటే, వందల తరాలుగా చచ్చుబడి ఉన్న సమాజాంగాలను మరమ్మతు చేసి, సమాజ దేహాన్ని మొత్తాన్ని ఆరోగ్యవంతం చేయడమే రిజర్వేషన్ల లక్ష్యం గానీ, చీలికలు తీసుకురావడం కాదనే గ్రహింపు ఉన్నట్లయితే, దళితవాదం మనుషులను వేర్పాటుకు గురిచేయలేదని, విడిపోయి ఉన్న మనుషుల మధ్య గోడలను బట్టబయలు చేసిందన్న ఎరుక కలిగి ఉన్నట్లయితే 'మాల, మాదిగ' రాజకీయపు టెత్తుకు దళితవాదులు చిత్తయిపోయి ఉండేవారు కాదు. కానీ, ప్రకటిత ఆదర్శాలకంటే, వాస్తవ ఆంతర్యాలు చాలా ముఖ్యమన్న స్పృహ వారి కీచులాట వల్ల మరింత స్పష్టమయింది. 'ఆచరణ' మాత్రమే ఆంతర్యాన్ని పట్టిచ్చే ఏకైక మార్గమని, ఆచరణని అప్రధానం చేసి, **'function'**లో దొర్లిన తప్పిదాలుగా దాటవేయడం' కుదరదని కూడా ఆంధ్రదేశంలో దళితవాద పరిణామక్రమం పరోక్షంగా బోధించింది. మఖలో పుట్టి పుబ్బలో రాలిపోయిన ఈ దళిత చైతన్యం తెలుగు సాహిత్యానికి మేలు చేసిందో, కీడు చేసిందో నిర్ధారించడం కష్టం. తరాలుగా గుండెలో సుడులు తిరుగుతున్న భావాలను బైట పెట్టే ఓదార్పును, ధైర్యాన్ని ఇచ్చి, మంచి కవులను అందించింది ఈ దళిత చైతన్యమే. బలమైన, మరింత కీర్తిదాయకమైన (బహుశా సురక్షితమైన) ఈమార్గం ఏర్పడినాక, 'ఆత్మశోధన' కు దిగిన సౌదావంటి వారిని సృష్టించిందీ ఈ దళిత స్పృహే. తెలుగు సాహిత్య విమర్శలో వేల్చేరు తర్వాత ఏర్పడిన శూన్యాన్ని పూడ్చగలిగిన అర్హత, ప్రతిభ ఉన్న అసురా (అంబటి సురేంద్రరాజు) ను హైజాక్ చేసింది కూడా ఈ దళిత చేతనే. కవిత్వానికి కొత్త రక్తాన్ని ఎక్కించిన కవుల్ని పుట్టించిన ఈ భావజాలమే, కొందరు మంచి కవుల్ని కల్చరల్ రిపోర్టర్స్ స్థాయికి దిగజార్చింది.

ఇక మైనారిటీ వాద కవిత్వం విషయానికి వస్తే, కవిత్వాన్ని ఆపివేయాల్సిన దశలోనే ఇక్కడ కవిత్వం మొగ్గ తొడిగింది (ఇతర రాష్ట్రాలలోని పరిస్థితుల గురించి నాకు తెలియదు). ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ఆంతర్యాల్ని ఉద్యమాల క్రియాశీలతలో గ్రహించలేకపోయినా, పర్యవసానాల ద్వారా కూడా గ్రహించవచ్చు. గతంలో ఆత్మగౌరవ పోరాటాల పేరిట జరిగినవన్నీ ఆదిపత్య పోరాటాలేనని కాలం రుజువుచేసింది. పర్యవసానమనే కొస వరకూ రాకున్నా దళిత పోరాటాల పేరిట జరిగిన ఆంతర్యం కూడా ఆధి పత్యం కోసం ఆరాటమేనని తేలిందిక్కడ. అయితే, పోరాటమైనా, యుద్ధమైనా సమవుజ్జీల మధ్యే జరగాలి. ఆ విధంగా చూస్తే మైనారిటీలైన ముస్లింలకు పోరాడే అవకాశమే లేదు. కానీ, భారతదేశంలో ముస్లింలందరూ ఒకటి కాదు. గుంటూరులో ముస్లిం హిందువులా బ్రతికినా, ఆలీగఢ్‌లో హిందువు ముస్లింగా జీవించినా దానికి మూలం ఒక్కటే. రాజీపడుతున్నామన్న స్పృహ లేకుండానే ఆధిపత్య వర్గాలతో రాజీపడిపోయే ధోరణి. ఒక అమూర్త అభద్ర భావన అందరు ముస్లింల గుండెచప్పుళ్లను ఒకటి చేసినా, సంఖ్యా పరంగా సమానంగా ఉన్న హైదరాబాద్, బొంబాయి వంటి చోట్ల మాత్రమే ఉద్రిక్తతలుంటాయి. అయితే, హైదరాబాద్ ముస్లింలా బొంబాయి ముస్లిం

ఆర్థికంగా బలవంతుడు కాడు. కనుకనే, అతి మామూలు రౌడీ మూక అయిన శివసేన రాష్ట్రాన్ని పాలించే స్థాయికి ఎదిగింది. బాబ్రీ మసీదు కూల్చివేత దేశంలో ముస్లింలకు ఒక హెచ్చరిక అయింది (దేశంలోనే ఏ ప్రాంతంలోనూ లేనంత కవితా వికాసాన్ని కనబరిచిన తెలుగు దేశం బహుశా ఇది గ్రహించిందేమో). అందుకు ప్రతిగా, ఇక ఆత్మగౌరవం కోసం చేసే ఏ ప్రతిఘటనోద్యమానికీ స్థానం లేదని ముస్లింలు బాంబే పేలుళ్ళ రూపంలో ప్రకటించారు. కనుక దేశంలోని మైనారిటీ వర్గాల అణిచివేత, హక్కులపై సంఘీభావం తెలుపుతున్న వర్గాలకి బాంబే పేలుళ్లు అందించిన సందేశమేమంటే..... **India in transition!** న్యాయం కోసం వీలైతే దొమ్మీకి దిగడం, లేదా లౌక్యంగా ప్రత్యర్థులతో చేరిపోవడం.... అంతే. ఈ సందేశం అర్థమయితే, ఆత్మగౌరవానికి ప్రతీక అయిన కవిత్వం ఆగిపోవాలి. కానీ, ఆంధ్రకవితకి దేశానికి బైట ప్రపంచంతో సంబంధం లేదు. తన **make believe** ప్రపంచంపై తనలో తాను పూరించుకునే యుద్ధశంఖారావమే కవిత్వం. కనుక మైనారిటీ ఆగ్రహ ప్రహసనానికి 'జల్‌జలా'లు ఆరంభాలయ్యాయి.

'ఆలోచన ఫర్ ఆలోచన సేక్' అయితే, ఎటువంటి దుష్పరిణామాలుంటాయో తెలుగు ఆధునిక కవిత్వాన్ని గమనిస్తే అర్థమవుతుంది. నవ్య భావాల పుట్టుకకు బదులు, 'నవ్య' మనిపించే భావాల తయారీకి నెలవయింది ఇక్కడ ఆధునిక కవిత్వం. రాడికల్ భావాలు మెజారిటీ వ్యతిరేకతను ఎదుర్కోవలసి ఉంటుందని అర్థం చేసుకున్న తర్వాత, ఆ ప్రతికూలతలో కూడా అహింసాత్మకమైన, మర్యాద పూర్వకమైన నిరసన మాత్రమే ఉంటుందని కూడా గ్రహించిన తర్వాత మరింత పెట్రేగిపోయాయి నవ్యతరాలు. ప్రోగ్రెసివ్ అయినా కాకున్నా, ప్రోగ్రెసివ్‌గా కనపడటంలో, అనిపించుకోవడంలో ఉన్న గ్లామర్‌కు **addict** అయ్యాయవి. ఎంతమందిని ఆశ్చర్యపరిస్తే, ఎంత మంది వ్యతిరేకిస్తే, లేదా ఎంత ఎక్కువ మంది. ఏవగించుకుంటే అంత ఎక్కువ నవ్యభావమనే దురభిప్రాయానికి వచ్చాయి క్రమేణా (అంతర్లీనంగా ఇందులో ఉన్నదీ పాపులారిటీ యావే). జాబిల్లి - ఒక భావకవికి రాయంచలా కన్పిస్తే, ఓ అభ్యుదయ కవికి ఆకాశపుటెడారిలో కాళ్ళు తెగిన ఒంటరి ఒంటెలా, మరో తిరుగుబాటు కవికి చయినా బజారులో వేలాడదీసిన దీపంలా, ఇంకా విప్లవ, దళిత కవులకు తమకు అనుగుణంగానూ కన్పించింది. వీటిలో ఏది తమ **mood** కి ప్రతినిధో, ఏది మెదడు కార్ఖానాలో తయారయిందో తేల్చి చెప్పడం కష్టసాధ్యమే. కానీ, ఏది తేల్చుకోవడానికైనా, నిగ్గుదీయడానికైనా వీలుండే చర్చకు ఆస్కారం లేకుండా పోయిందీ నేల మీద. ఏ 'నవ్య' భావాన్ని వ్యతిరేకించినా, కనీసం ప్రశ్నించినా ఎక్కడ ప్రోగ్రెసివ్ కాకుండా పోతామేమోనన్న భయంతో విమర్శకులు, దేనిని చర్చించబోయినా 'కన్జర్వేటివ్' లేబుల్‌తో బ్లాక్‌మెయిలింగ్‌కు దిగుతూ కవులు..... విమర్శకు తావులేకుండా చేసేశారు. కవులు **cult figures** గా తయారవడానికి కారణమిదే. సాదా సీదా కవిత్వ స్థాయి కూడా లేని **mediocre** రచన అయిన నగ్నముని 'కొయ్యగుర్రా'నికి కవిత్వ రహస్యాలు క్షుణ్ణంగా తెలిసిన సురేంద్రరాజు వంటి అత్యున్నత స్థాయి విమర్శకుడు కూడా **succumb** అయిపోవడం కవుల పట్ల అంధ ఆరాధనకు ఒకానొక ఉదాహరణ మాత్రమే.

ఉపసంహారంగా ఒక తాజా సంఘటనను సవివరంగా ప్రస్తావించడం సందర్భోచితమని అనిపిస్తోంది. కొత్త సహస్రాబ్దికి లేదా కొత్త శతాబ్దానికి 'నాందీ వాచకంగా' సుమారు వంద మంది

కవులతో 'కవిగానం' అనే కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేసింది 'మాధ్యమం' అనే ఒక సకల కళావేదిక. ఏ ఆదర్శం, ఏ **verbose** నిజస్వరూపాన్నైనా, అద్దం వెనక వార్నిష్‌ను గీకి మరీ అర్థాన్ని పరీక్షించుకున్నట్టు పరిశీలించాలని ఎన్నో 'ఆధునికతా' అనుభవాలు నేర్పి ఉన్నాయని గ్రహించాం కనుక, ఈ సకల కళావల్లభుల ఆదర్శాల వెనక ఆంతర్యాలను గమనిద్దాం. 100 మంది ఆధునిక కవులను ఒక వేదిక మీదకు తేవడమనే లక్ష్య మొక్కటే కాదు, తెలుగు కవిత్వాన్ని ఇతర ప్రాంతాలకు అందిస్తున్న ('ప్రోత్సహిస్తున్న' కూడా!!!) అనువాదకులను ప్రత్యేకంగా ఆహ్వానించి, చందన తాంబూలాదులతో సత్కరించుకోవాలని నిర్ణయించుకోవడం ద్వారా కూడా 'మాధ్యమం' తన ఆంతర్యాన్ని తెలియజేసింది. ఇంత పకడ్బందీగా బాజాభజంత్రీలను సిద్ధం చేయడం చూసి కవిలోకం పులకించిపోతుందని భావించింది మాధ్యమం. తెలుగు కవుల నాడి తెలుసును కనుక, తామూ ఆ కుదుళ్ల నుంచి వచ్చిన వాళ్లే కనుక, అదే భరోసాతో చాలా మంది కవుల ఒప్పుకోలు కోరకుండానే వారి పేర్లను 'మాధ్యమం' ఆహ్వాన పత్రంగా ప్రచురించేసింది. ఆహ్వాన పత్రికలో తమ పేరు ఉండటం తమను కవిగా గుర్తించారనడానికి చక్కని దాఖలాగా కవులు భావించి, గర్విస్తారన్న ధీమాతో ఉన్న 'మాధ్యమం', అంతకు మించి కీర్తి కేంద్రక వ్యూహంతో 'లొంగని తరా' నికి చెందిన కొందరు కవులు దాడి చేయడంతో తబ్బిబ్బయిపోయింది. మాధ్యమం ఎత్తులు ఇలా చిత్తవగా, మరో పక్క 'నిషాద' మనే లొంగని తరం కవుల వ్యూహం విజయవంతమైన వైనం ఇలా ఉంది :

మాధ్యమం ఏర్పాటు చేసిన 'కవిగానం' మీద 'నిషాదం' ఉద్దేశం (వారు ప్రచురించిన కరపత్రం ప్రకారం) క్లుప్తంగా ఏమిటంటే, అది 'పైరవీల సోపానగానం; వందమందినే కాదు, వెయ్యి మంది కవుల్ని కూడా డస్ట్ సక్కర్‌లాగా మెయిన్ స్ట్రీం ఆధిపత్య భావజాల రూపాల్లోకి పీల్చుకుని తొడలు చరిచే బ్రాహ్మణీయ కోవర్ట్ రాజకీయాల కమ్మని జాల' మని. కనుక మనకు అర్థమయ్యేదేమిటంటే, వీరి వ్యతిరేకత **(unspirited)** కవి సమ్మేళనాల మీద కాదు. చివరి రోజుల్లో అవార్డు సాధించుకున్న అజంతా, ఇంకా సర్కారీ అవార్డు దక్కని 'మో' వంటి 'సీనియర్' కవుల నేతృత్వంలో **Ontological** కవి సమ్మేళనాల గురించి ఏ వ్యతిరేకతా లేదు. ఈ వ్యతిరేకతంతా - ప్రభుత్వ అవార్డులు సాధించుకోవడమే గాక, తామే **State** గా రూపొందిన కవుల అజమాయిషీలో జరుగుతున్న కవి సమ్మేళనాల మీదనే అన్నమాట. మత మార్పిడులు జరుగుతున్నాయని కాషాయ ధారులు గగ్గోలు పెడుతున్నట్టు, రాజ్యాన్ని ఎదిరించే, ధిక్కరించే కవులను, ఆధిపత్యభావజాలం తనలోకి లాక్కుంటుందని నిషాదం క్రోధావేశాలు వెళ్లగక్కింది. అంటే అర్హులకు రాకుండా, అవార్డులన్నీ అనర్హులు హైజాక్ చేస్తున్నారని నిన్నటి తరాల ఏడుపయితే, అవార్డులకు మించిన అర్హుల్ని, పోటీ ప్రభుత్వాల వంటి మేరునగ ధీర కవుల్ని అవార్డుల ఎరతో వలలోకి లాగేసుకుంటున్నారని కాబోలు 'నిషాదం' శోకం. నిజానికి ఇది ఆంధ్రసాహిత్యలోకానికి ఉన్న మరో ముఖ్యమైన అవలక్షణం. తమను గురించి సరిగా అంచనా వేసుకోలేక పోవడం; లేదా చాలా ఎక్కువగా అంచనా వేసుకోవడం. చిన్నప్పుడు చందమామ కథల్లో రాకుమారుడిగా, ఇంకొంత పెరిగాక మోరియార్టీని పట్టుకునే షెర్లాక్‌హోమ్స్‌గా, మరింత ఎదిగాక విక్టర్ జారాలుగా, పాబ్లోనెరుడాలుగా, వోల్‌సొయింకాలుగా, గర్షియా మార్క్వెజ్‌లుగా .... ఊహించుకొని **fantasize** చేసుకోవడం ఒక బలహీనత. అవార్డులు ఇవ్వడం ద్వారా అగ్రవర్ణ

ఆధిపత్య మరాఠీ రాజ్యం దళిత రచయితలను తన ప్రధాన స్రవంతిలో కలిపేసుకుందని ఎక్కడో చదివిన గుర్తు ఉండి ఉండొచ్చు. దాంతో, అలా తమ మీద కూడా రాజ్యం కన్నేసి ఉందని గొప్ప మధురోహలు పోతారు. దానితో యుద్ధం చేస్తున్నట్టు అభినయిస్తారు. పూచికపుల్లలంతటి విలువ కూడా లేని వీళ్ల అక్షరాలతో పాపం రాజ్యానికి ఏవిధమైన సంబంధం లేదు. ఈ అక్షరయోధులను అవార్డుల వలలో బంధించి, భద్రత వెదుక్కోవాలన్న తపన రాజ్యానికి అంతకంటే లేదు. కానీ, అలా అనుకోవడం లోని 'థ్రిల్', గాల్లన్న కొద్దీ కావాలి ఇటువంటి 'లొంగని తరాల'కి. అయితే, ఈ థ్రిల్ కోసం కీర్తిని ఫణంగా పెట్టడమా? కీర్తి కోసం థ్రిల్‌ను వదులుకోవడమా? సమస్యగా తోచి ఉండొచ్చు చాలా మంది లొంగని తరం కవులకు. మహత్తరమైన ఉపాయం ఒకటి తళుక్కున మెరిసింది. ఒక్క దెబ్బకు కీర్తికి కీర్తి, థ్రిల్లుకు థ్రిల్లునూ? కవిగానంలో పాల్గొనడం కంటే దానికి నిరసన వ్యక్తం చేయడం ఎక్కువ ప్రయోజనకరమైనదిగా కనిపించింది. అవార్డులను ఆశించిన 'మాధ్యమా' నికి, అవార్డులపై ఆగ్రహించిన 'నిషాదా' నికి విభేదం లేదు. అవార్డుల ప్రాముఖ్యతను ఇరు వర్గాలూ బాగానే గుర్తించాయనే దీని అర్థం. అలా గాక, స్ఫూర్తిలోపించిన కవి సమ్మేళనాల మీద మాత్రమే 'నిషాదం' ఆగ్రహమైతే, ముందుగానే పిలుపునిచ్చి 'కవిగానా' న్ని నిరోధించగలగాలి. లేదా, తమది గైర్హాజరు మాత్రమే కాదని, పూర్తిగా స్థాయి బహిష్కరణ అని తెలిసేలా కరపత్రాలు పంచాలి. అలా చేయకుండా తమకే స్పష్టతలేని నిరసన తెలియజేయడం ద్వారా 'కవిగానం' ప్రాముఖ్యతని పెంచినట్టయింది. దళితత్వమనే అత్యభ్యున్నత భావాలని ప్రదర్శించుకునేందుకు; తన ఫాంటసీలను తృప్తి పరుచుకునేందుకు; ప్రభుత్వ ఆధ్వర్యంలో కాకపోయినా, సర్కారీ వాసనలు సోకిన ఏదైనా సభ జరిగితే 'ప్రజాస్వామ్యయుతం'గా నిరసన వ్యక్తం చేయాలన్న తీవ్ర వాంఛ తీర్చుకునేందుకు వారికి మాధ్యమం ఒక సువర్ణావకాశాన్ని కల్పించినట్టయింది. కనుక 'కవిగానం' జరిగితే కాదు, జరగకపోతేనే, రద్దయిపోతేనే 'నిషాదా' నికి ఎక్కువ బాధ అయ్యేదేమోనని పిస్తోంది. కనుక మాధ్యమం 'కవిగానం' ఎంతటి ప్రహసనమో, నిషాదం 'నిరసన రాగం' కూడా అంతటి ప్రహసనమే అయింది. కొత్త శతాబ్దిలో కవులు కొత్త మేనిఫెస్టోలతో సిద్ధమవుతారన్న ఆశ ఏ కొంచెం మిగిలి ఉన్నా, శతాబ్ది ప్రారంభంలోనే కవిలోకంలో జరిగిన ఈ రభసతో సమాధి అయిపోయింది.

కవుల్ని ప్రొఫెషనల్ కెరీరిస్టులుగా మిగల్చడమే 20వ శతాబ్దం తెలుగు కలానికి ఇచ్చిన కానుక. లేదా కెరీరిజం నుంచి, మరింత విస్తృతమైన కెరీరిజం వైపుకు 20వ శతాబ్దాన్ని నడిపించడమే తెలుగు సాహిత్యానికి ఆధునిక కవుల contribution* (సందేహాస్పదమైన చైతన్యం ఆలంబనగా నడిచిన కవులకు 'ఆధునిక' శబ్దం నప్పకపోయినా కేవలం కాల సూచిగానే దానిని వాడాను. ఇక ఉత్తరాధునిక, ఆధునికోత్తర... ఇత్యాది వర్గీకరణకి తెలుగు సాహిత్య లోకం పూర్తిగా అన్వర్థమన్న స్పృహతో, ఉద్దేశపూర్వకంగానే ఆ విశేషణాలను చేర్చలేదు.) జీవితానికి ఉన్న బహుముఖీనత మీద శీతకన్ను వేసిందని, లేదా ఆ బహు ముఖత్వం ఎరగని బావుల్లో ఉండిపోయిందని పద్యకవిత్వం మీద విమర్శ ఉంది. ఆ లోపాన్ని తీర్చడమే ఆధునిక కవిత్వం లక్ష్యమయితే, ఆ బహుముఖత్వంతో ఇంత ఉపరితల సంబంధాన్ని పెట్టుకున్న ఈ ఆధునిక కవిత్వం అదనంగా సాధించిందేమిటన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నే. కనుక, మార్పును ఆశించే ఏ వర్గమైనా, శాఖ అయినా తన వర్గ నాయకత్వ 'స్వార్థ ప్రయోజనాల'నే ఏకైక ఉమ్మడి లక్ష్యంతోనే ముందు శతాబ్దాలకూ నడుస్తోందని స్పష్టమైన, ప్రమాదకరమైన సంకేతాలు పంపించడమే 20వ శతాబ్దం తెలుగు సాహిత్య (కవిత్వ) పు ముక్తాయింపు. (సమాప్తం)

# నవ్యాంధ్ర నిర్మాణ నిర్మాతల జంట

**- డా॥ విజయబక్ష్**

ఆంధ్ర దేశంలో మత సంస్కరణ, సంఘసంస్కరణ విడదీయరాని అంశాలుగా కొనసాగాయి. సంఘంలో జరిగే అనేక దురాచారాలకు మతం యొక్క ఆమోద ముద్ర ఉందనేది నిర్వివాదాంశం. సంఘ సంస్కరణ కార్యకలాపాలు పటిష్టంగా కొనసాగాలంటే మత విశ్వాసాల్లో కాలం తీరిన వాటిని ఏరి పారవేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏ సంస్కర్తయినా ముందు మతంలో పాదుకు పోయిన అంధవిశ్వాసాలతో అవిశ్రాంత పోరాటం సలుపవలసి వస్తుంది. అందుకే భారతదేశ పునరుజ్జీవనానికి జవం- జీవం పోసిన రాజారామోహనరాయ్ సంఘసంస్కరణకు ముందుగా 'బ్రహ్మ సమాజమనే' పేరుతో మత సంస్కరణను చేపట్టాడు. కుల వ్యవస్థను ఆమోదింపక పోవటం, బాల్య వివాహాలను రద్దు చేయడం, స్త్రీ విద్యను ప్రోత్సహించడం, వితంతు వివాహాలను ఆచరింప చేయడం, మూఢ విశ్వాసాలపై పోరుగా ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజం, పరిశుద్ధాస్తిక మతంగా, సంఘ సంస్కరణే ధ్యేయంగా కొనసాగింది.

ఆంధ్ర దేశంలో సంస్కరణోద్యమం ఆధునిక చరిత్రకు దోహదం చేసిందెవరా అని ప్రశ్నించుకుంటే కందుకూరి వీరేశలింగం పేరు చెప్పకుండా మనం ముందుకు వెళ్లలేం. అయితే ఆయనతో సమానంగా సాంఘిక దురాచారల మీద పోరు సలుపుతూ తన ప్రేమామృతాన్ని పలువురికి పంచి పెట్టిన అనాథల నాథ 'బ్రహ్మర్షి' రఘుపతి వెంకటరత్నం నాయుడు.

ఇరువురు బ్రహ్మసమాజికులు కావటం, ఇరువురిలో సంఘ సంస్కరణాభిలాష మిక్కుటంగా ఉండటం, ఇరువురు సంఘ సర్వతోముఖాభివృద్ధిని కాంక్షించటం - మీదు మిక్కిలి ఇరువురు ఒకే కాలంలో జీవించటం ఆంధ్రదేశం చేసు కొన్న పుణ్యమనే చెప్పాలి.

ఒకరు ప్రాచీన సంప్రదాయాల కాలవాలమై, కళలకు పుట్టినిల్లై కవితా ఝురులు ప్రవహింప చేసిన పావనగోదావరి తీరాన తన కార్యకలపాలు చేపట్టగా, మరొకరు సంపదలకు నిలయమై రాజాధి రాజుల ఆదరణకు నోచుకొని, విద్యా గ్రంథాలను పండించిన తూర్పు సుముద్ర తీరాన్ని తన కార్య రంగంగా ఎంచుకొన్నారు.

ఆ తరంలో చదువుకొన్న వారిలో సగానికి సగం మంది పంతులు గారి ప్రభావానికి లోనయిన వారైనా అయి ఉండాలి, లేదా నాయుడు గారి శిష్య పరమాణువులయినా కావాలి.

ఒకరు సాహిత్య వ్యాసంగం ద్వారా అజరామరమైన కృషిని సల్పి సమాజానికి శస్త్ర చికిత్స చేయ పూను కొంటే - మరొకరు ఉత్తమ శ్రేణికి చెందిన విద్యా వేత్తగ భావి తరాలకు బంగారు బాట వేసే ఉత్తమ పౌరుల నందించటానికి జీవితాన్ని ధారపోసారు. ఇద్దరూ సమాజసేవలో తరించిన వారే. 'మానవసేవే మాధవసేవ' అనే సూక్తిని త్రికరణ శుద్ధిగ నమ్మినవారే. వీరేశలింగం స్త్రీ విద్యావ్యాప్తికి కంకణం కట్టుకొని, బాలికా పాఠశాలలు స్థాపించగా, వెంకటరత్నం తాను ప్రిన్సిపాలుగా పనిచేస్తున్న మహారాజా కళాశాలలో ఆడపిల్లల నుండి ఫీజులు వసూలు చేయలేదు.

తన ముందు వారు చెదురు మదురుగ ఆరంభించిన సంఘ సంస్కరణ కలాపాలకు ఒక నిర్దిష్ట

రూపాన్నిచ్చి, కార్య రంగంలోకి దుమికి సాంఘిక సంస్కరణల కొక ఉద్యమ రూపాన్ని సంతరించి పెట్టిన 'కర్మవీరుడు' వీరేశలింగం. సాహిత్యాన్ని సామాజిక ప్రయోజనానికి వీరేశలింగమంతగ వాడుకొన్నవారు మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు. ఆ క్రమంలోనే ఆయన అనేకానేక సాహిత్య ప్రక్రియలకు స్రష్ట అయినాడు. నిర్మాణాత్మకత- ఆచరణాత్మకత ఆయన్ని విశేషవ్యక్తిగా, ఆంధ్ర దేశం శాశ్వతంగా గుర్తుపెట్టుకొనే వ్యక్తిగా చేసాయి. ఎవరు కలసి వచ్చినా, రాకున్నా ఆయన ప్రగాఢ విశ్వాసమే ఆయనకు తోడుగ ఉండేది. ఆయన చేతిలోది కలమో! కత్తో అనే అనుమానం వచ్చేంత తీవ్రంగా ఆయన ఎన్నో విషయాలను రాతలతోనే ఖండించారు. తెలుగునాట నెలకొని ఉన్న అవిద్య, బాల్య వివాహాలు, కన్యాశుల్కం, లంచగొండితనం, వేశ్యాలంపటత్వం, భోగం మేళం, అస్పృశ్యత, స్త్రీల పట్ల అనాదరణ, మూఢ విశ్వాసాలు, - ఒకటేమిటి? ఇన్నింటి మీద తన కలాన్ని (కత్తిని) ఝుళిపించాడు. ఝూర్ఝూ మారుతంలా విరుచుకపడ్డాడు. హేతుబద్ధమైన ఆలోచనాసరళి లోపించి, నైతిక శూన్యమైన, మానవత్వాని కిసుమంతైనా తావులేని సమాజంతో అలుపెరగని పోరాటం సల్పిన కర్మిష్టి ఆయన. ఎన్నో మూఢ విశ్వాసాలను నిర్ద్వంద్వంగ ఖండించాడు. ఆయన ఏ రచన చేసిన ఆయన సంస్కరణాభిలాష అంతర్వాహినిగా తప్పకుండా చోటు చేసుకొనేది అందులో. తాను బ్రాహ్మణ కులానికి చెందిన వాడైనా బ్రాహ్మణుల్లో ఉన్న డంభాచారాల నెన్నింటినో ఆయన పరిహసించాడు. ఇది - అది అని ఎందుకు సమాజంలో నెలకొన్న ఎన్నో అనారోగ్య కారణాలనాయన తూర్పారబట్టాడు.

వెంకటరత్నం నాయుడు బ్రాహ్మసమాజం కేంద్ర బిందువుగ మానవాళికి అనంతమైన సేవ చేయటానికి పూనుకొన్న మహనీయుడు. తల్లిదండ్రులెవరో తెలియని అనాథ బిడ్డలను తన సొంత బిడ్డలుగ పెంచి పెద్ద చేసి విద్యా బుద్ధులు గఱపి, పెండ్లిళ్ళు పేరంటాలు జరిపాడు. దానశీలి దయార్ద్ర హృదయుడైన పిఠాపురం రాజా వారి అండదండలతో అనాథాశ్రమాన్ని నెలకొల్పాడు. అస్పృశ్యులనబడే వారిని అక్కున చేర్చుకొన్నారు. ఇట్లా బాల బాలికలకై వేరు వేరుగా అనాథాశ్రమాలు నెలకొల్పబడటం - ఆంధ్ర దేశంలోనే మొదటి విషయం. గాంధీజీ హరిజనోద్ధరణ కార్యక్రమం చేపట్టటానికి ముందే, జాతీయోద్యమం కంటే ముందే 1909 లోనే అనాథ శరణాలయం ప్రారంభింప పడింది. శరణాలయం స్థాపించటం ఒక ఎత్తు! అక్కడి పిల్లల అలానా పాలనలో లోటు లేకుండా చూచుకోడం మరొక ఎత్తు! కులమత వర్ణ ప్రసక్తి లేకుండా అక్కడి బిడ్డలంతా కన్నతల్లిదండ్రుల చేతుల్లో పెరిగినంత ప్రేమగా అక్కడ పెరిగారు.★

అక్కడ పెరిగిన ఆడపిల్లలు శరణాలయాన్ని తమ పుట్టిల్లుగా భావించే వారు. అంతటి ప్రేమాభిమానాలు వారికి అందించారు నాయుడు.

★ అనాథా శరణాలయంలో పెరిగి, ఉపాధ్యాయ వృత్తి నుండి రిటైర్డు అయ్యి, ప్రశాంత జీవితం గడుపుతున్న ఇద్దరు వృద్ధులను (స్త్రీ-పురుషులను వ్యాస రచయిత్రి 'బ్రహ్మసమాజ సాహిత్యం' మీద పరిశోధన చేసేటప్పుడు కలవగా, వారు అనాథ శరణాలయం గురించి చాల గొప్పగా చెప్పారు. వారి మాటల్లో 'మారాజా నాయన' 'మా నాయనా' (రాజావారిని, నాయుడు గారిని) అని పదే పదే పొగడటం కద్దు (1987)


స్త్రీ జాతి గౌరవ ప్రతిపత్తులని కోరుకొని, వారికొక మంచి జీవితాన్ని ప్రసాదించాలనే తాపత్రయంతో మన దేశంలో నెలకొని ఉన్న 'దేవదాసి' వృత్తిని మాన్పించటానికై చాల కృషి చేసాడు. ఆనాడు పెండ్లిళ్ళలో, దేవుని ఉత్సవాల్లో 'భోగం మేళం' తప్పనిసరి. అది లేకపోతే ఏదో లోపం జరిగినట్లే! అంటువంటి రోజుల్లో తన విద్యార్థుల నుండి తమ పెండ్లిళ్ళల్లో భోగం మేళం పెట్టుకోమని; అది ఉన్న ఏ ఉత్సవాలకు హాజరవమని ప్రతిజ్ఞ చేయించాడు. ఆయన తలపెట్టిన ఈ దేవదాసి వృత్తి వ్యతిరేక కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. ఎంతో మంది ఆ కులంలోని వారు ఈ వృత్తి నిర్మూనలలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. అంతేకాదు. వారిలో పెండ్లిళ్ళను ఆయన ప్రోత్సహించటం - చేయటం కూడా జరిగింది. ఆయన చేసిన గుప్తదానాలు ఎన్నో లెక్క లేదు. చిట్ట చివరలో ఆయన వద్ద ' ఎన్నో మనియార్డరు రసీదులు' ఉన్నవట.

అస్పృశ్యులను ఉద్ధరించాలని, స్త్రీలను బాగు చేయాలని, అందరిని సమదృష్టితో ప్రేమించాలని వేదికనెక్కి ఉపన్యాసం చెబితే వట్టి సిద్ధాంత కర్త - బోధకుడు మాత్రమే అవుతాడు. అట్లాకాక తాను చెప్పిన దానినంత తన జీవితాంతం ఆచరించి చూపబట్టే ఆయన 'బ్రహ్మర్షి' అయినాడు. ఒకసారి రాజమండ్రిలో శ్రీ తెన్నేటి సూర్యనారాయణ నాయుడు గారికి జిల్లా హరిజన సేవక సంఘానికి ఉపాధ్యాక్షులుగా ఉండమని కోరారు. దానికి ఆయన ''సరేకాని. ఒక షరతు. మీరు అస్పృశ్యతా నివారణ మేరకే ప్రచారం చేస్తున్నారు. నాకు సమూలంగ కులనిర్మూలనకు, అంతర్వివాహాది సర్వ మానవ హక్కుల కొరకు పని చేయడానికి స్వేచ్ఛ ఉంటేనే అంగీకరిస్తాను. హరిజన సేవకు ఇంత వరకు అని హద్దు పెడితే నాకిష్టం లేదు'' అన్నాడట.

ఇట్లా వీరేశలింగం - నాయుడు గార్ల జీవితాల గురించి ఒకసారి పరిశీలిస్తే ఎన్నో సంఘటనలు ఆశ్చర్యం గొలిపేవిగా ఉంటాయి. ఇద్దరు ఎన్నో మార్లు ఆంధ్ర దేశంలో జరిగిన సాంఘిక మహా సభలకు అధ్యక్షులుగా ఉన్నారు. గంజాం నుండి రాయలసీమలోని అప్పటి బళ్ళారి వరకు జరిగిన సంస్కరణ సభల్లో పాల్గొన్నారు. ఇద్దరు ఇంచుమించు ఒకే విధమైన ఆశయాలతో పనిచేసినవారే. నిరంతరం కార్య రంగంలో మునిగి పోయిన వారే. పరస్పరం అభిమానించుకొని, గౌరవించుకొన్న వారే! రాజమండ్రిలో వీరేశలింగ ఆస్తికోన్నత పాఠశాలకు పిఠాపురం రాజా వారు భూరి విరాళాన్నిచ్చారు. రాజా వారి కత్యంత ఆప్తులు నాయుడుగారు. మంచి ఆలోచనలు, ఆచరణలో దిట్టలు అయిన వీరిద్దరికి రాజావారి ఆర్థిక అండదండలు దొరకటంతో కూడ వారు చేపట్టిన కార్యక్రమాలు విజయవంతమయినాయి.

ఆంధ్రదేశంలో సంస్కరణోద్యమం తీవ్రతరం కావటానికి ఇటువంటి మహనీయులు ఆచరణాత్మకతనే ఊపిరిగా గ్రహించటం వల్లనే ఒకరు మధ్యందిన మార్తాండునిలా పొగలు సెగలు చిమ్మితే, మరొకరు చల్లని తెల్లని వెన్నెలను కురిపించిన చంద్రుడు. అనుసరించిన మార్గాల్లో కొంత తేడా ఉన్నా ఇద్దరు నవ్యాంధ్ర నిర్మాతలనేది అంగీకరించవలసినదే.

వీరేశలింగం 1919 మే 27న పరమపదించగా, మరణంలో సహితం నేను మీ వెంటనే ఉన్నానన్న రీతి' 1939 మే 26న నాయుడు కీర్తి శేషులయ్యాడు. అటువంటి మహాత్ముల కృషిని మనం ఈ సందర్భంలో గుర్తు తెచ్చుకొని, జోహారులర్పించడం కర్తవ్యం కదా !



రుగ్ణశయ్యపై విద్రావక ఆక్రందన

చిత్రకారుడు : బి.కె.ఎస్. వర్మ

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.



ఈ సమృద్ధ ప్రకృతి పుత్రికకు నాగరికుల మనిపించుకొన్నవారిచ్చే కానుక ఏమి?

చిత్రకారుడు : బి.కె.ఎస్. వర్మ